పెన్ పవర్
తెలంగాణ రౌండప్

బౌరంపేట్ 472 లో అసైనీలు సాగుచేసిన వరిపొలం పరిశీలిస్తున్న ఈటల..

మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్..

పేదల భూములతో... రియల్ ఎస్టేట్ వ్యాపారమా..?

రేవంత్‌రెడ్డి సర్కారుపై బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ ఫైర్..!

- భూములు గుంజుకోవడంలో రేవంత్‌రెడ్డి రీసెర్చ్ స్కాలర్ అంటూ ఘాటు విమర్శలు..
- రేవంత్‌రెడ్డి ల్యాండ్ బ్రోకర్‌గా మారారు.. అంటూ తీవ్ర ఆరోపణలు..
- దళితుల భూములే కనిపిస్తున్నాయా..? ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ ఈటల..
- ప్రభుత్వ భూమి ప్రజలది 'రేవంత్‌రెడ్డి, కేసీఆర్'లది కాదని వ్యాఖ్యలు..
- కంచె చేను మేసినట్లు పేదల భూములను ప్రభుత్వం లాక్కుంటోందని ధ్వజం..!
- పేదల కళ్లలో కన్నీళ్లు వస్తే.. నా కళ్లలో వచ్చినట్టే.. ఈటల రైతులకు భరోసా..
- పేదలకు అన్యాయం చేస్తే ప్రభుత్వ అంతు చూస్తాం.. మెడలు వంచుతామని హెచ్చరిక..

బౌరంపేట్ సర్వే నెంబర్ 472 ప్రభుత్వ భూమిని రైతులతో సందర్శించిన ఈటల రాజేందర్..

మేడ్చల్ జిల్లా బ్యూరో/దుండిగల్, పెన్ పవర్, ఆగస్టు 17: ఐదు-ఆరు దశాబ్దాలుగా వ్యవసాయం సాగుచేసుకుని జీవిస్తూ, ఆ భూములను కాపాడుకుంటూ వస్తున్న అసైనీ రైతుల నుండి రేవంత్‌రెడ్డి సర్కార్ భూములు గుంజుకుని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని, మల్కాజిగిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.. గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో బీజేపీ నాయకులతో కలిసి పర్యటనలో భాగంగా, బౌరంపేట్ సర్వే నెంబర్ 472, 166 దళితుల భూముల సమస్యలను ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్ళారు.. తమ తరతరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందని ఆరోపిస్తూ దళిత రైతులు, మహిళలు చేపట్టిన ధర్నాకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మద్దతు తెలిపారు.. రైతులతో కలిసి సంబంధిత భూములను పరిశీలించిన ఆయన.. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.. బౌరంపేటలోని సర్వే నెంబర్లు 472, 166లోని భూములను దళితులకు దాదాపు 50-60 ఏళ్ళ క్రితమే కేటాయించారని, ఐదు, ఆరు తరాలుగా ఆయా కుటుంబాలు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నాయని రైతులు ఈటలకు వివరించారు.. భూములకు పన్నులు కూడా చెల్లిస్తున్నామని, ఒకప్పుడు 30 కుటుంబాలుగా ఉన్న తమ జీవనం ఇప్పుడు వందలాది కుటుంబాలకు విస్తరించిందని తెలిపారు.. తమ జీవనాధారమైన ఈ భూములను కోల్పోతే కుటుంబాలతో కలిసి ఎక్కడికి వెళ్లాలని మహిళలు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు..

-4లో

బౌరంపేట్ ప్రెస్‌మీట్‌లో ఎంపి ఈటల రాజేందర్..

- గండిమైసమ్మ-దుండిగల్ మండలంలో పర్యటించిన ఎంపి ఈటల రాజేందర్..
- బౌరంపేట్ సర్వే నెంబర్ 472, 166 ప్రభుత్వ భూములు సందర్శించి పరిశీలన..
- స్థానిక బీజేపి నేతలు అసైనీలతో కలిసి భూములు సందర్శించి ప్రెస్‌మీట్..
- బౌరంపేట్ దళిత రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన ఈటల రాజేందర్..
- రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఈటల సర్కార్‌పై నిప్పులు చెరిగారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

సర్వే నెం.23 ప్రభుత్వ భూమిని పరిరక్షించండి..

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..
- డీసీపీ కార్యాలయం స్థలాన్ని పరిరక్షించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి..
- ప్రభుత్వ స్థలానికి ముందస్తుగా పొజిషన్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఫిర్యాదు..

- బీఆరెస్ హయాంలో డీసీపీ కార్యాలయం కూల్చేసి ఆ స్థలానికే ఎసరు..
- సర్వే నెం.23లోని రెండు ఎకరాలపై మైసా కన్‌స్ట్రక్షన్ కబ్జా యత్నాలకు చెక్ పెట్టాలి..
- డీసీపీ కార్యాలయం కోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలి..
- రెండు ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సతీష్ డిమాండ్..
- ప్రభుత్వ భూమిని ప్రైవేటు నిర్మాణాలకు అప్రోచ్ రోడ్డుగా మార్చే ప్రయత్నం..!
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు వ్యవహరించాలి..!
- వారం రోజుల్లో ప్రభుత్వ స్థలం రక్షణకు చర్యలు చేపట్టాలి..
- చర్యలు లేకుంటే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన..

-5 లో

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలి..

- సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ ఫిర్యాదు..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో కంప్లైంట్..!

-7 లో

పేదల భూములతో.. రియల్ ఎస్టేట్ వ్యాపారమా..?

ఎంపి ఈటల రాజేందర్‌తో బీజేపీ నేతలు, అసైనీ రైతులు..



రైతులతో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్..

ఓటేసిన పాపానికి భూములు గుంజుకుంటారా..?

ధర్నాలో పాల్గొన్న మహిళలు, రైతులు తమ భూములు తమకే ఇవ్వాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు.. తరతరాలుగా దున్నుకుంటూ జీవిస్తున్న భూముల నుంచి వెళ్లిపోవాలని చెప్పడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.. తాము కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశామని, అందుకే తమ భూములను ప్రభుత్వం గుంజుకుంటుందా అని ప్రశ్నించారు. తమ హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడతామని స్పష్టం చేశారు.. రైతుల ఆవేదనను విన్న ఈటల రాజేందర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. పేదల భూములు గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటూ ఈటల ఆరోపించారు.. భూముల విషయంలో ముఖ్యమంత్రికి ఉన్నంత 'నాలెడ్జ్' ఎవరికీ లేదని, పేదల భూములు గుంజుకునే విషయంలో ఆయన 'రీసెర్చ్ స్కాలర్'గా మారారని ఎద్దేవా చేశారు..

దళితుల భూములే కనిపిస్తున్నాయా..?

హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పేదలు, దళితుల భూములపై ప్రభుత్వ దృష్టి పడిందని ఈటల ఆరోపించారు.. రేవంత్‌రెడ్డికి దళితుల భూములే కనిపిస్తున్నాయని.. హైదరాబాద్ చుట్టూ ఉన్న జాగాలను చేరబట్టారని విమర్శించారు. పేదల భూములను తీసుకోవడమే కాకుండా వాటిని అమ్ముకుని ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు.. ప్రభుత్వానికి భూమి అవసరమైతే రైతులతో చర్చించి న్యాయమైన పరిష్కారం చూపాలని సూచించారు.. ప్రభుత్వ భూమి అంటే ప్రజలది.. అది రేవంత్‌రెడ్డిదో, లేకపోతే కేసీఆర్‌లదో కాదని స్పష్టం చేశారు.. ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకునే సందర్భంలో పేదలకు న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ భూమి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు..

భూములు తీసుకోవడంలో రేవంత్‌రెడ్డి 'రీసెర్చ్ స్కాలర్'..!

తాను ఎంపీగా గెలిచింది పేదల కోసం మాట్లాడటానికేనని ఈటల రాజేందర్ అన్నారు.. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ నిలబడతానని స్పష్టం చేశారు. పేదల కళ్లల్లో కన్నీళ్లు వస్తే.. నా కళ్లల్లో వచ్చినట్టుగా భావిస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. బౌరంపేట్‌లో దళిత రైతులకు ఎంపీగా, బీజేపీ తరఫున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని తెలిపారు.. అనంతరం నిర్వహించిన పత్రికా సమావేశంలోనూ ఈటల రాజేందర్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కొనసాగించారు.. రేవంత్‌రెడ్డికి పాలనలో అనుభవం లేదనుకున్నామని.. కానీ పేదల భూములను గుంజుకునే విషయంలో 'రీసెర్చ్ స్కాలర్'గా మారారని వ్యాఖ్యానించారు.. 5-6 దశాబ్దాల క్రితమే, పేదలకు అసైన్‌మెంట్ పట్టాల ద్వారా లక్షలాది ఎకరాల భూములు అందాయని, ప్రస్తుత విధానాలతో వాటిపైనా పేదలకు భద్రత లేకుండా పోతోందని ఆరోపించారు..

పేదలను ఇబ్బంది పెడితే అంతు చూస్తాం: ఈటల..

హైడ్రా పేరుతో అర్ధరాత్రి ఫెన్సింగ్‌లు వేస్తున్నారని, కంచె చేనును మేసినట్లు ప్రభుత్వం పేదల భూములను బలవంతంగా లాక్కుంటోంది, అంటూ విమర్శించారు. ప్రభుత్వం అంటే ల్యాండ్ బ్రోకర్ నా..? ల్యాండ్ అమ్ముకునే కంపెనీనా..? అని ప్రశ్నించారు.. దళితుల భూములను స్వాధీనం చేసుకుంటున్న ప్రభుత్వాన్ని బీజేపీ నిలదీస్తుందని ఈటల హెచ్చరించారు. పేదలను ఇబ్బంది పెడితే రేవంత్‌రెడ్డి సర్కార్ అంతు చూస్తామని.. మీ మెడలు వంచుతామని, ఘాటుగా హెచ్చరించారు.. బౌరంపేట్ దళిత రైతుల పక్షాన బీజేపీ పూర్తిగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, మంగమ్మ, సుధాకర్, వాసు, రాజిరెడ్డి, మల్లేష్, సతీష్, శివాజీ, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, జంగారెడ్డి, రామచంద్రారెడ్డితో పాటు రైతులు జీతారం, వీరయ్య, జీతయ్య, బలరాం, బాలేష్ తదితరులు పాల్గొన్నారు..

అసైనీలతో, మహిళలతో ఈటల రాజేందర్..

Bowrampet	472	31.34	Govt.	1.Substation(Ac.10-00gts) 2.DILL/Housing Board including road (Ac.21-00gts) 3. Remaining agricultural ensroachment including road (Ac.0-34gts)

రెవెన్యూ రికార్డుల్లో..

సర్వే నెంబర్.472లో టిజిహెచ్‌బి హెచ్చరిక బోర్డు 10న..

బౌరంపేట్ సర్వే నెంబర్ 166 విషయంలో, రైతుల ఆరోపణలు సక్రమమే అయినప్పటికీ.. సర్వే నెం. 472 ప్రభుత్వ భూమి వ్యవహారంలో, ఎంపి ఈటల రాజేందర్‌కు సరైన సమాచారం, ఇవ్వకుండా తప్పుదోవ పట్టించారో ఏమోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. 472 ప్రభుత్వ భూమిలో మొత్తం 31.34 ఎకరాలు మాత్రమే ఉన్నట్టు రెవెన్యూ అధికారిక రికార్డులు చెబుతున్నాయి.. అందులో 10 ఎకరాల్లో ఇప్పటికే సబ్‌స్టేషన్ నిర్మాణం ఉన్నది అందరికీ తెలిసిందే.. మరో 21 ఎకరాల భూమిని 2009 డిసెంబర్ 1న తెలంగాణ హౌసింగ్ బోర్డు సంస్థ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి, ఎకరాకు రూ.3 కోట్లు చొప్పున చెల్లించి కొనుగోలు చేసినట్టు అధికారిక రికార్డులు స్పష్టతను ఇస్తున్నాయి.. మిగిలింది 00-34 గుంటలు మాత్రమే.. అదికూడా అసైనీలే వ్యవసాయం చేస్తున్నారని, రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా కనిపిస్తుంది.. సర్వే నెంబర్ 472లో 'టిజిహెచ్‌బి' సంస్థకు చెందిన 21 ఎకరాల భూమికి, 'ప్రీ కాస్ట్' సిమెంట్ పలకలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, సుమారు 5 హెచ్చరిక బోర్డులు పెట్టిన విషయం అందరికీ తెలిసిందే.. టిజిహెచ్‌బికి ఈ స్థలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హయాంలోనే కేటాయించారని, ఎకరా ఒక్కంటికి రూ.3 కోట్లు ప్రభుత్వానికి చెల్లించినట్లు టిజిహెచ్‌బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెన్ పవర్ ప్రతినిధితో ప్రస్తావించారు..

సర్వేచేసి 21 ఎకరాలకు, ఈనెల 6న హద్దులు నిర్ధారించిన అధికారులు

ఈనెల 6న సర్వేలో తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, హౌసింగ్ బోర్డు అధికారులు..

రోడ్డుకు అడ్డంగా పెట్టిన హెచ్చరిక బోర్డులు తొలగించిన దృశ్యం..

- బీఆరెస్ హయాంలో డీసీపీ కార్యాలయం కూల్చేసి ఆ స్థలానికే ఎసరు..
- సర్వే నెం.23లోని రెండు ఎకరాలపై మైసా కన్‌స్ట్రక్షన్ కబ్జా యత్నాలకు చెక్ పెట్టాలి..
- డీసీపీ కార్యాలయం కోసం కేటాయించిన భూమిని పరిరక్షించాలి..
- రెండు ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సతీష్ డిమాండ్..
- ప్రభుత్వ భూమిని ప్రైవేటు నిర్మాణాలకు అప్రోచ్ రోడ్డుగా మార్చే ప్రయత్నం..!
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు వ్యవహరించాలి..!
- వారం రోజుల్లో ప్రభుత్వ స్థలం రక్షణకు చర్యలు చేపట్టాలి..
- చర్యలు లేకుంటే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన..

సర్వే నెం.23 ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

అధికారులు గతంలో ప్రభుత్వ భూమిలో పెట్టిన హెచ్చరిక బోర్డు, కందకం తవ్వినది..

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆకుల సతీష్ ప్రెస్‌మీట్..

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..
- డీసీపీ కార్యాలయం స్థలాన్ని పరిరక్షించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి..
- ప్రభుత్వ స్థలానికి ముందస్తుగా పొజిషన్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఫిర్యాదు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.. ఏ నినాదంతో స్వ రాష్ట్ర సాధన మొదలైందో, ఆ నినాదం పక్కన పడేశారు.. నాటినుండి నేటివరకు అధికారంలో ఉన్న పార్టీలు ప్రత్యర్థులపై పగలు ప్రతీకార చర్యలతో పరిపాలనా సౌలభ్యం కుంటు పడుతోంది.. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ దొందూ దొందేనని నిరుపిస్తున్నారు.. ప్రభుత్వాలు మారినా, ప్రభుత్వ భూముల కబ్జాలు యధావిధిగానే కొనసాగుతున్నాయి.. ప్రభుత్వ శాఖ ఏదైనా అవినీతే లక్ష్యం..? అక్రమార్జనే ధ్యేయం..? రాష్ట్రం ఏర్పాటు నుండి నియంతృత్వ విధానాలతో, పరిపాలన తయారైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ఇదంతా ఎందుకు గుర్తు చేసుకోల్సిన దుస్థితి ఏర్పడిందో, చూడండి.. పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమిని, మైసా కన్‌స్ట్రక్షన్‌కు కట్టబెట్టేందుకు, అవినీతి రాజకీయ నాయకుల తీరు రోతపుట్టిస్తుంది.. ప్రభుత్వ భూమిలో నిర్మించిన డీసీపి ప్రభుత్వ కార్యాలయాన్ని కూల్చేసిన ఘనత నాడు బీఆర్ఎస్‌కే దక్కుతుంది.. దౌర్భాగ్యం ఏమిటంటే..! కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ బీఆర్ఎస్‌కు సహకరించే విధంగా, మైసా కన్‌స్ట్రక్షన్ అప్రోచ్ రోడ్డుకే ప్రాధాన్యత ఇవ్వడం మన దౌర్భాగ్యం.. ఈ వ్యవహారంలో ఇద్దరు ఐఏఎస్ అధికారుల (సిఎంసి కమిషనర్-జిల్లా కలెక్టర్) ఆదేశాలతో అక్రమార్కులకు కట్టబెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 17:

మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, పేట్ బషీరాబాద్ పరిధిలోని సర్వే నెంబర్ 23లో డీసీపీ కార్యాలయం కోసం గతంలో కేటాయించిన రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని తక్షణమే పరిరక్షించాలని ఆకుల సతీష్ టీమ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించారు. ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన విలువైన స్థలానికి వెంటనే, ముందస్తుగా పొజిషన్ కల్పించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.. ఆకుల సతీష్ టీమ్ తెలిపిన వివరాల ప్రకారం.. పేట్‌బషీరాబాద్ సర్వే నెంబర్ 23లో 2023కు ముందే డీసీపీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించారు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే కార్యాలయం కూడా నిర్మించారు.. మైసా కన్‌స్ట్రక్షన్‌కు అడ్డొస్తుందని భావించి, 2023 లోనే, డీసీపీ కార్యాలయాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు.. అప్పటి నుండి ఈ రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతర నిర్మాణాలకు ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.. ముఖ్యంగా కొన్ని నిర్మాణాలకు అప్రోచ్ రోడ్డుగా ఈ ప్రభుత్వ స్థలాన్ని వినియోగించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.. ప్రభుత్వ అవసరాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఈ స్థలాన్ని ఆ నిర్మాణ సంస్థకు అప్రోచ్ రోడ్డు కోసం, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు..

అధికారులపై 'ఐఏఎస్'ల ఒత్తిళ్లు ఉండకూడదు: ఆకుల సతీష్..!

పేట్ బషీరాబాద్ సర్వే నెం.23 ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఐఏఎస్, ఒత్తిడి మేరకు,జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడం తక్షణమే నిలిపివేయాలని ఆకుల సతీష్ టీమ్ డిమాండ్ చేసింది.. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు రాజకీయ నాయకులు, ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా, రెవెన్యూ రికార్డులు, భూమి కేటాయింపు ఉద్దేశ్యం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని కోరారు.. డీసీపీ కార్యాలయం వంటి ప్రజా భద్రతకు సంబంధించిన కీలకమైన ప్రభుత్వ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జాదారుల కోసం ప్రయత్నాలు ఉపసంహరించు కోవాలని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ముందుగానే రక్షించాలని సూచించారు.. స్థలాన్ని ఖాళీగా ఉంచడం వల్ల ఆక్రమణలకు గురవుతాయని, అందువల్ల వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు..

వారం రోజుల్లో ఫెన్సింగ్ ఏర్పాటుకు డిమాండ్..

సర్వే నెంబర్ 23లోని రెండు ఎకరాల స్థలానికి వారంలోపు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, అడ్వాన్స్ పొజిషన్ కల్పించాలని అధికారులను ఆకుల సతీష్ టీమ్ కోరింది. డీసీపీ కార్యాలయం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలం భవిష్యత్తులో ఇతర అవసరాలకు మళ్లించకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని, కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఇతరుల నిర్మాణాలకు అప్రోచ్ రోడ్డుగా ఉపయోగించేందుకు అనుమతిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తిపై హక్కులు, వినియోగంపై వివాదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు..

చర్యలు లేకుంటే శాంతియుత నిరసన..!

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతామని ఆకుల సతీష్ టీమ్ హెచ్చరించింది.. ప్రభుత్వ స్థల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కొనసాగిస్తామని తెలిపింది.. సర్వే నెంబర్ 23లో డీసీపీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావివ్వకుండా ప్రభుత్వ అవసరాల కోసమే కాపాడాలని, అధికారులు తక్షణమే స్థలాన్ని పరిశీలించి హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆకుల సతీష్ టీమ్ డిమాండ్ చేసింది.

ప్రారంభమైన ప్రజావాణి సమస్యలపై వినతుల వెల్లువ


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో

సహాయ కేంద్రం వద్ద దరఖాస్తు రాస్తున్న అధికారులు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 17: గార్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీలు తదితర సమస్యలపై ప్రజలు వినతిపత్రాలను సమర్పించారు.ప్రజలు తమ సమస్యలను అధికారులకు వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ప్రజావాణిలో ప్రజాసంఘాల నాయకులు కోరారు . అధికారులు బాధితుల నుండి దరఖాస్తులు తీసుకొని రిజిస్టర్లో నమోదు చేసి దరఖాస్తుదారునికి ప్రత్యేక రసీదు అందజేశారు దరఖాస్తుదారులకు దరఖాస్తు నింపేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు ఎంపీడీవో మంగమ్మ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తూ దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించారు అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కేంద్రాలకు వెళ్లే పని లేకుండా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 46 దరఖాస్తులు అందాయనిప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పరిష్కరించగల సమస్యలను స్థానికంగానే పరిశీలించి , ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 23 శాఖల అధికారులలో తాసిల్దార్ శారద తో పాటుగా డిప్యూటీ తాసిల్దార్ ఎంపీ ఓ ఏవో వెటర్నరీ ఎంఈఓ ఏపీఎం ఎస్సీ బీసీ ఎస్టీ ఆర్బి వెల్ఫేర్ ఫారెస్ట్ విద్యుత్ హౌస్ ఐ సి డి ఎస్ ఆర్ అండ్ బి మెడికల్ ఏ డిజి డబ్ల్యు ఓ ఇరిగేషన్ ఫిషరీస్ ఎస్ హెచ్ ఓ 21 మంది వివిధ శాఖల అధికారులు హాజరు కాగా రెండు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

28వ వార్డులో సీపీఐకు ఎదురుదెబ్బ

ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 17: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో సీపీఐకు మరో ఎదురుదెబ్బ తగిలింది. వార్డుకు చెందిన ఆలేటి అవినాష్, దాచేపల్లి వినోద్ లు సీపీఐకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ నాయకులు అక్కినేపల్లి దేవయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు భూక్యా సురేష్ నాయక్ సమక్షంలో అవినాష్, వినోద్ కుటుంబ సభ్యులు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 28వ వార్డు అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల రామ్మోహన్ రెడ్డితో కలిసి పార్టీ బలోపేతానికి, వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇదే వార్డుకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ నెల చివరి వారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యానికి కరాటే శిక్షణ: మాస్టర్ బి. రాము

సర్టిఫికేట్లతో కరాటే విద్యార్థులు

విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేస్తున్న మాస్టర్

ఎల్బీనగర్ పెన్ పవర్, ఆగస్టు 17: ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కరాటే అకాడమీ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. తెలుగు నేల ఖ్యాతిని ప్రపంచ వేదికపై చాటిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అధికారిక సర్టిఫికెట్లు, ప్రత్యేక మెడల్స్ అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బెల్ట్ టెస్టింగ్ పోటీలలో చిన్నారులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ అద్భుతమైన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను, మెరుపులాంటి ఆత్మరక్షణ ప్రదర్శనలను చాటి వీక్షకులను ఎంతగానో కట్టిపడేశారు. అనంతరం నిర్వహించిన ప్రధాన సభలో విజేతలను పురస్కారాలతో ముంచెత్తారు.ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా, నిర్వాహకులుగా పీఎం.రాము, కరాటే అకాడమీ యోధ గుజారియో మాస్టర్ బి.రాము, ఎ.సతీష్, టి.సంజీవ్, కే.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు. చిన్నారులు చిన్నతనం నుంచే కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవడం వల్ల శరీర దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వారు పేర్కొన్నారు. గిన్నిస్ రికార్డు సాధించి ప్రాంతం పేరును అంతర్జాతీయ వేదికపై నిలబెట్టిన విద్యార్థులను, వారికి అద్భుత శిక్షణ ఇచ్చిన మాస్టర్లను వారు ప్రత్యేకంగా శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మార్షల్ ఆర్ట్స్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

షాదీ ముబారక్ కల్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 17: రాష్ట్రంలోని ఆడబిడ్డల పెళ్లిలకు ఇస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలం శెట్టి రమేష్ అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గార్ల మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఇచ్చే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసి ఓట్లు దండుకుని అధికారానికి వచ్చిందని ఆరోపించారు. హైకోర్టు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకలపై స్టే విధించడం ముమ్మాటికి రేవంత్ రెడ్డి సర్కార్ అసమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని మహిళా లోకానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని, లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు ఆర్థిక భారంగా మారుతున్న నేపథ్యంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బుడిగ మురళి కొండల్ నాగయ్య రాములు బాలు గడ్డం అశోక్ మీగడ శ్రీనివాస్ ఖదీర్ రెడ్డి మల్ల ఉమేష్ గద్దపాటి నరసింహ తాళ్లూరి అనిల్ శ్రీనాథ్ మహేష్ విజయ్ కుమార్ సలీం బండారి వెంకట్ బాలు రాందాసు వెంకటేశ్వర్లు విజయ్ వెంకటేష్ దేశపాక మురళి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు తూట్లు పొడిచే కుట్ర: నరదాసు లక్ష్మణ్‌రావు

హైదరాబాద్ పెన్ పవర్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు ఆరోపించారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయలేక పథకాలపై హైకోర్టులో కేసులు వేయించి స్టే వచ్చేలా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పిలుపు మేరకు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాలతో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరదాసు లక్ష్మణ్‌రావు, చల్ల హరిశంకర్ తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత కల్పిస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, మహిళా శ్రేణులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి రద్దు కై కాంగ్రెస్ కుట్ర

హైదరాబాద్ పెన్ పవర్: జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం లోని కొడిమ్యాల మండలంలో సోమవారం రోజున చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పథకాలను తొలగించే కుట్రలను మానుకోవాలని కొడిమ్యాల మండల తహసిల్దార్ నరేష్ కు వినతి పత్రం అందజేశారు..

లిఅనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లపై హైకోర్టు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదన్నారు..

కోర్టు సాకులతో ఎత్తివేతకు ప్లాన్ చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ కు మహిళలే కర్రు కాల్చి వాత పెట్టే రోజులు రానున్నాయని జోష్యం చెప్పారు..

2014 వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు మానవీయ కోణంలో భారతదేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆడపిల్ల పెళ్లిభారం కాకూడదని మేనమామ గా కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లను ప్రవేశపెట్టిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు.

కెసిఆర్ గారి నాయకత్వంలో దాదాపు 13 లక్షల మందికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లు అందజేసి చరిత్రలో నిలిచారన్నారు

తులం బంగారం ఇవ్వవలసి వస్తుందని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసేసే కుట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది అన్నారు ఇప్పటికైనా పథకాలపై నిర్లక్ష్యం వీడి పెండింగ్ లో ఉన్న కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లను పేదింటి ఆడబిడ్డలకు అందించాలని అన్నారు

హైకోర్టు సాకుతో కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తుందన్నారు

హైకోర్టు గడువు ఇచ్చినా కూడా కౌంటర్ దాఖలు చేయని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.

బుద్ధారం, డాక్య తండాలకు బీటీ రోడ్లు నిర్మించాలి

ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 17: బుద్ధారం అండర్‌గ్రౌండ్ నుంచి బుద్ధారం గ్రామం వరకు, అలాగే గోపాలపురం నుంచి డాక్య తండా వరకు బీటీ రోడ్లు నిర్మించాలని సీపీఐ గార్ల మండల సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గార్ల మండల కేంద్రంలోని ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో మంగమ్మ కు వినతిపత్రం అందజేశారు. అనంతరంఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ బుద్ధారం డాక్య తండా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రహదారి సౌకర్యం ఎంతో అవసరమని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెండు మార్గాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలనిప్రజావాణిలో సమర్పించిన వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న మాగంలోకేష్ మేదరమెట్ల గిరిప్రసాద్ హరినాయక్ ఎర్రగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు సైతం ప్లాస్టిక్ నియంత్రణకు ఫిర్యాదు..



- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం మోపాలని, జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం.
- ఫంక్షన్ హాళ్లు, హోటళ్లలో ప్లాస్టిక్ ఇస్తరాకులకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి..
- రైతుబజార్లు, వారాంతపు అంగళ్లలో తనిఖీలు ముమ్మరం చేయాలని విన్నపం.
- డ్రైనేజీలను ముంచేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలపై చర్యలు..
- ప్లాస్టిక్ తయారీ, విక్రయాలపై కఠినంగా నిఘా పెట్టాలి..!

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టాలి

- సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ ఫిర్యాదు..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో కంప్లైంట్..!

కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు, రవిందర్ ముదిరాజ్ ఫిర్యాదు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 17: నగరంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు కోలా రవిందర్ ముదిరాజ్ కోరారు.. ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐఏఎస్)ను కలిసిన, కోల రవీందర్ ముదిరాజ్ ప్లాస్టిక్ సమస్యను వివరించారు.. ఫంక్షన్ హాళ్లు, రైతుబజార్లు, వారాంతపు సంతలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దేవస్థానాలు, క్యాటరింగ్ కేంద్రాల్లో నాణ్యతలేని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ఇస్తరాకులు, బాటిళ్ల వినియోగం రోజు రోజుకు పెరిగిపోతోందని తెలిపారు. ఫంక్షన్ హాళ్లలో వేలాది రూపాయల అద్దె వసూలు చేస్తున్నప్పటికీ స్టీల్ ప్లేట్లకు బదులుగా ప్లాస్టిక్ ఇస్తరాకుల్లో భోజనాలు వడ్డిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు.. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లో పేరుకుపోవడంతో వర్షాల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కాలనీలు ముంపునకు గురవుతున్నాయని అన్నారు.. ఇటీవల హైడ్రా, డ్రైనేజీల శుభ్రత చర్యల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ప్లాస్టిక్ ఇస్తరాకులు బయటపడటమే సమస్య తీవ్రతకు నిదర్శనమన్నారు..

వివిధ సర్కిల్‌లకు జోనల్ కమిషనర్ ఆదేశాలు..

ప్లాస్టిక్ కవర్‌ల సమస్యపై స్పందించిన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల యజమానులు, దేవస్థానాల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించాలని అన్ని సర్కిల్ కమిషనర్లను ఆదేశించారు. అనంతరం నిబంధనలు ఉల్లంఘించే వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు, రవిందర్ ముదిరాజ్ మీడియాకు వెల్లడించారు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ, విక్రయాలు, వినియోగంపై కఠినమైన నియంత్రణలు అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరారు. గోమాతలు, జలవనరులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు కేవలం అవగాహన కార్యక్రమాలకే పరిమితం కాకుండా, తయారీ కంపెనీలు మొదలుకొని విక్రయాలు, వినియోగం వరకు ప్రతి దశలోనూ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యపై వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన జోనల్ కమిషనర్‌కు కోల రవీందర్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు..

యువతిని హతమార్చిన యువకుడు

హైదరాబాద్ పెన్ పవర్: బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దారుణమైన హత్య ఘటన చోటుచేసుకుంది. లభించిన సమాచారం ప్రకారం, 21 ఏళ్ల మొహమ్మద్ సలాం పై 21 ఏళ్ల రెహానా హత్య కేసు నమోదు చేసారు. . ఇద్దరూ ఒకే ఫంక్షన్ హాల్లో పనిచేస్తున్నారు. రెహానా, దాదాపు ఒక సంవత్సరం నుంచి సలాం తో ప్రేమ సంబంధంలో ఉండి, బక్రీద్ సమీపం నుంచి బిస్మిల్లా కాలనీలో సలాంతో కలిసి నివసిస్తున్నట్లు బంధువులు చెబుతున్నారు. పోలీసుల సమచారం ప్రకారం, ఆదివారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత రెహానాను హతమార్చి బ్యాగులో పెట్టి పారిపోవడానికి ప్రయత్నించాడు. హత్య అనంతరం మృతదేహాన్ని ఒక గోనె సంచిలో పెట్టి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో బాలాపూర్ పోలీసులు మొహమ్మద్ సలాంను పట్టుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, హత్యకు గల అసలు కారణాలు మరియు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కస్తూర్బా పాఠశాలలో ఫుడ్ పాయిజన్: 18 మంది విద్యార్థులకు అస్వస్థత....

హైదరాబాద్ పెన్ పవర్: సిద్దిపేట జిల్లా మద్దూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రాత్రి భోజనం వికటించి 18 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పితో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులను పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

నకిలీ పెరుగు గుట్టు రట్టు

హైదరాబాద్ పెన్ పవర్: కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని వైష్ణవి ఎన్క్లేవ్ లో నందిని మిల్క్ సెంటర్లో అక్రమంగా కల్తీ పెరుగు, కల్తీ కోవా తయారీ సెంటర్ పై మల్కాజిగిరి ఎస్.ఓ.టీ పోలీసులు దాడి చేశారు. సుమారు 120 కిలోల కల్తీ పెరుగు, 6 కిలోల కోవాను తరలిస్తున్న రామచందర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్.ఓ.టీ ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ కల్తీ పాలకోవా, కల్తీ పెరుగును తయారు చేస్తూ మ్యానుఫ్యాక్చర్ డేటు, ఎక్స్పైరీ డేటుతో పాటు, ఎలాంటి లేబల్ వేయకుండా చాలా కాలంగా అక్రమంగా విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు నందిని మిల్క్ సెంటర్ పై మల్కాజ్గిరి ఎస్ఓటి ఎస్సై సాయికుమార్, ఎస్వోటీ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మెరుపు దాడులు చేశామని తెలిపారు. కల్తీ వస్తువులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని, టాటా ఏసీ వాహనాలను సీజ్ చేశారు ఎస్ఓటి పోలీసులు. నందిని మిల్క్ పార్లర్ ఓనర్ రామచందర్ ను అదుపులోకి తీసుకున్నారు. పెరుగు, కోవా శాంపిల్ లను ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ కు పంపించి పూర్తి ఆధారాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు నందిని మిల్క్ పార్లర్ లో తనిఖీలు నిర్వహించగా దాదాపు 1000 కిలోల పెరుగు, 50 కిలోల కోవా నిలువ ఉంచినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వారికి హానిచేసే కల్తీ ఆహార పదార్థాలు, నకిలీ వస్తువులు ఎవరైనా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎస్వోటీ ఎస్సై సాయికుమార్ హెచ్చరించారు.

కోట్లు తిన్నారు.. కాంగ్రెస్ లో చిన్నారెడ్డి రేపిన చిచ్చు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ కాంగ్రెస్ మార్క్ "సహజ సిద్ధమైన అంతర్గత ప్రజాస్వామ్యం" మరోసారి మైకు ముందే కాదు.. ప్రజా క్షేత్రంలోనూ బద్దలైంది. "నా ఓపిక నశిస్తోంది జాగ్రత్త.. ఇక నేను కూడా సీనియర్ నేత జీవన్‌రెడ్డి బాటలోనే తిరుగుబాట పడతా" అంటూ మాజీ మంత్రి, సీనియర్ నేత జి. చిన్నారెడ్డి విసిరిన సవాల్ ఇప్పుడు హస్తం పార్టీలో కాక రేపుతోంది.

సోనియా గాంధీ స్వయంగా "పాపం చిన్నారెడ్డికి వనపర్తి టికెట్ ఇవ్వండి.. ఎన్నికల ఖర్చులకు డబ్బులు లేకపోతే పార్టీ ఫండ్స్ నుంచే చూసుకోండి" అని రేవంత్ రెడ్డికి కబురు పంపారట. కానీ మన ఎన్నికల కమిటీ బాబులు ఊరుకుంటారా? సోనియా మాట కంటే 'నోట్ల మూట'కే ప్రాధాన్యమిచ్చి.. మేఘారెడ్డికి టికెట్ ఇచ్చేశారని చిన్నారెడ్డి ఆవేదనతో పాటు ఆరోపణల అస్త్రాన్ని ప్రయోగించారు. అధిష్ఠానం మాటకే విలువ లేకపోతే.. ఇక సీనియర్ల మాటను ఎవరు వింటారనేది ఆయన మార్క్ ప్రశ్నా బాణం..ఇక ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చిన్నారెడ్డి చేసిన ఆరోపణలు ఒక రేంజ్‌లో ఉన్నాయి. నియోజకవర్గాన్ని అవినీతిమయం చేశారని.. అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఐటీ టవర్ పనులు, నర్సింగాయిపల్లి పీజీ సెంటర్ రూ.9 కోట్ల గర్ల్స్ హాస్టల్, రూ.15 కోట్ల బాయ్స్ హాస్టల్ పనులకు ఎమ్మెల్యే గారే స్పీడ్ బ్రేకర్లు వేశారట. కారణం ఏంటయ్యా అంటే... ఆ కాంట్రాక్టర్ మనాయన కాదు అని.. "మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కలిసి కోట్లు నమిలేశారు.. నా రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తే చూస్తూ ఊరుకోను" అని చిన్నారెడ్డి హెచ్చరించారు.

మొత్తానికి కాంగ్రెస్‌లో పదవులు, టికెట్లు రాని సీనియర్ల అసంతృప్తి 'జీవన్‌రెడ్డి బ్రాండ్' తిరుగుబాటు రూపంలో రూపాంతరం చెందుతుండటం.. శ్రేణులకు సరికొత్త పొలిటికల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఏ రేంజ్‌లో రియాక్ట్ అవుతారో.. అధిష్ఠానం ఈ అసంతృప్తి మంటలను ఎలా చల్లారుస్తుందో వేచి చూడాలి!

కూటమిలో ఏం జరుగుతోంది

విజయవాడ, ఆగస్టు17, పెన్ పవర్: తెలుగు రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత , పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యత చేపట్టడం ఆయన అభిమానులకు గర్వ కారణం. అయితే పవన్ కళ్యాణ్ కేవలం ఆ పదవి ని అలంకరణ కోసం వాడుకోకుండా, తానూ బాధ్యత చేపట్టిన శాఖలకు నూటికి నూరు శాతం న్యాయం చేస్తున్నాడు. వైసీపీ పార్టీ ప్రభుత్వ హయాం లో 24 వ స్థానం లో ఉన్న ఈ శాఖ, ఇప్పుడు మొదటి స్థానానికి చేరుకుందంటే పవన్ కళ్యాణ్ పని తీరు ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామా సభలు ఏర్పాటు చేసి, గ్రామాల్లోని ప్రజలు చేత వాళ్లకు అవసరమయ్యే పనులన్నీ కలెక్టర్ల దృష్టికి చేర్చి, పల్లె పండుగ పేరుతో రెండు విడతల్లో పవన్ కళ్యాణ్ ఈ స్థాయి ఫలితాలను అందుకున్నాడు.అభిమానులు ఎంతసేపు సినిమా ఫ్యాన్ వార్స్ లో దూరి రికార్డ్స్ కోసం కొట్లాడుకోవడం కాకుండా, ఇలాంటి విషయాలను జనాల్లోకి తీసుకెళ్తే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ ఎక్కడికో వెళ్తుంది అంటూ సోషల్ మీడియా లో రాజకీయ విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యం లో ప్రతీ ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సేతత్ వికాస్ జాతీయ సంస్థ గ్రామీణాభివృద్ధి, నీటి సంరక్షణ , పారిశుద్యం విభాగాల్లో పురస్కారాలను అందిస్తూ ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే పంచాయితీ రాజ్ శాఖ లో అవార్డులు అందుకుంది. ఇప్పుడు వరుసగా రెండవసారి కూడా అవార్డులను అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం అయితే పంచాయితీ రాజ్ శాఖ ఏకంగా 5 విభాగాల్లో అత్యుత్తమ ర్యాంక్ అందుకుంది. గుడ్ గవర్నెన్స్ విభాగం లో శృంగవరం పంచాయత్ మొదటి స్థానం లో నిలబడింది.అదే విధంగా వుమెన్ ఫ్రెండ్లీ పంచాయత్ గా బొక్కాసం పాలెం అనే గ్రామం కూడా మొదటి స్థానం లో నిల్చింది. పేదరికం లేని గ్రామంగా, అత్యంత ప్రమాణాలతో జీవనం సాగుతున్న గ్రామం గా చెమ్ములపల్లి పంచాయత్ 2 వ స్థానం లో కొనసాగుతుండగా, సెల్ఫ్ సఫీషియాలింట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగం లో గుండుమల పంచాయత్ 3వ ర్యాంక్ లో కొనసాగుతుంది. ఇక ఉత్తమ మండలం విభాగం లో అయితే కుప్పం దేశం లోనే 3 వ ర్యాంక్ సాధించింది. ఇలా పవన్ కళ్యాణ్ ఆద్వర్యం లో పంచాయితీ రాజ్ శాఖ ఎప్పుడూ చూడనంత అభివృద్ధిని చూస్తూ దేశంలోనే మన ఆంధ్ర ప్రదేశ్ ని ఆదర్శవంతమైన రాష్ట్రము గా తీర్చి దిద్దాడు పవన్ కళ్యాణ్.

ఎద్దు.. దద్దమ్మ.. శాసనమండలిలో నేతల తిట్ల పర్వం

హైదరాబాద్ పెన్ పవర్: ఏపీ శాసనమండలి సమావేశాలలో నేతల దూషణల పర్వం చర్చనీయాంశంగా మారింది. మంత్రి అచ్చెన్నాయుడు, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యానారాయణ పరస్పరం వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంతో సభలో గందరోగళం చోటుచేసుకుంది. ప్రతిపక్ష నేత బొత్సను మంత్రి అచ్చెన్నాయుడు 'దద్దమ్మ' అంటే అందుకు ప్రతిగా బొత్స కూడా తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. మనిషి ఎద్దులా పెరిగితే సరిపోదు భాష కూడా సరిగా రావాలి అంటూ ప్రతిపక్ష నేత ఎదురుదాడి చేశారు. అయితే బొత్స అభ్యంతరాలను లెక్కచేయని మంత్రి అచ్చెన్నాయుడు పదేపదే దద్దమ్మ అంటూ విరుచుకుపడ్డారు. నా పర్సనాలిటీ గురించి మాట్లాడుతున్నారు, ఐదేళ్లు డీఎస్సీ వేయించలేకపోయారు అందుకే దద్దమ్మా అంటూ మరోసారి వ్యాఖ్యానించడంతో సభలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.శాసనమండలి వర్షాకాల సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల మంటలు పుట్టించాయి. సభ ప్రారంభమైన నుంచి డీఎస్సీపై చర్చించేందుకు విపక్షం పట్టుబడగా, అధికార పక్షం ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ లక్ష్యంగా చేసిన విమర్శలతో సభలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సభలో విపక్ష సభ్యులు "మెగా డీఎస్సీ.. దగా డీఎస్సీ" "ఇదేమీ రాజ్యం దొంగల రాజ్యం" అంటూ నినాదాలు చేయడంతో మంత్రి అచ్చెన్నాయుడు కలుగ చేసుకున్నారు. "డీఎస్సీ మీద మాట్లాడే నైతిక హక్కు గొడ్డలి పార్టీకి లేదు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి (బొత్స సత్యానారాయణ) సిగ్గు పడాలి. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ఇవ్వలేకపోయారు. ఎన్నికల్లో మాట ఇచ్చి మాట తప్పారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. బొత్స సత్యానారాయణ విద్యాశాఖ మంత్రిగా ఉండి వారి గొడ్డలిపార్టీ అధ్యక్షుడికి చెప్పుకోలేని "దద్దమ్మ".. ఈ రోజు మళ్లీ శాసనమండలిలో మాట్లాడుతున్నారు." అంటూ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

దీనిపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. దీంతో సభను కాసేపు వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ సభ ప్రారంభం కాగా, ప్రతిపక్ష నేత బొత్స మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో మైకు లేకపోవడంతో బొత్స మాట్లాడిన మాటలు రికార్డు కాలేదు. మనిషి ఎద్దులా పెరిగితే సరిపోదంటూ మంత్రి అచ్చెన్నాయుడుపై బొత్స ఆగ్రహంవ్యక్తం చేయగా, మళ్లీ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకున్నారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసి డీఎస్సీ వేయించలేకపోయినందునే దద్దమ్మ అన్నానంటూ మరోసారి పునరుద్ఘాటించారు. దద్దమ్మ అన్నది అన్ పార్లమెంటరీ అయితే క్షమాపణ చెబుతా, చేతకాని వారిని దద్దమ్మ అంటారు అంటూ తీవ్ర స్వరంతో మాట్లాడారు. నా పర్సనాలిటీ గురించి మాట్లాడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక అచ్చెన్నాయుడు మాటలను అడ్డుకున్న బొత్స గొడ్డలి పార్టీ, దద్దమ్మ అనే విమర్శలను ఆక్షేపించారు. ఆ మాటలను వెనక్కి తీసుకోమని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సభలో ఏ అంశంపైన అయినా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అంతేకాకుండా "డీఎస్పీపై చర్చించేందుకు ఈ బుక్ లెట్ ను పంపిస్తా.. సిగ్గు ఉండాలి. డీఎస్సీ పెట్టలేదు. 300 కేసులు వేశారు. కోర్టు కూడా చీవాట్లు పెట్టింది. మీకు సిగ్గుండాలి. నైతిక హక్కు ఎక్కడ ఉంది". అంటూ ఎదురుదాడి చేశారు. దీంతో సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రి అచ్చెన్నాయుడు, ప్రతిపక్ష నేత బొత్స మధ్య వాగ్వాదం కొనసాగుతుండగానే సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో సభలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

ప్రత్యక్ష ఎన్నికలు...టీడీపీ వర్సెస్ వైసీపీగానే !



హైదరాబాద్ పెన్ పవర్: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. కూటమి ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగానే ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని చూస్తోంది. ఇదే క్రమంలో ఈసారి ఎన్నికల విధానంలో కీలక మార్పులను తీసుకుని రావాలని భావిస్తోంది. అందులో భాగమే డైరెక్ట్ ఎన్నికలు. అంటే కార్పోరేషన్లలో మేయర్ పదవికి, మునిసిపాలిటీస్ లో చైర్మనలు జెడ్పీ ఎంపీపీ చైర్మన్లకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి అన్న మాట. ప్రజలు నేరుగా తమ ఓటు వేసి వారిని ఎన్నుకుంటారు. దీని వల్ల ఎవరు మేయర్ గా ఉండాలి, ఎవరు జిల్లా పరిషత్తు చైర్మన్ గా ఉండాలి అన్నది ప్రజల చేతిలోనే ఉంటుంది అన్న మాట. నిజానికి ఇది మంచి విధానమే. టీడీపీ గతంలో దీనినే అమలు చేస్తూ వచ్చింది. అయితే కాంగ్రెస్ హయాంలో పరోక్ష ఎన్నికల విధానం తీసుకుని వచ్చారు. దీని వల్ల పదవులు అన్నీ అధికారంలో ఉన్న వారే దక్కించుకుని వీలు కలుగుతుంది.

బ్రేకులు వేస్తూ :

అయితే ఇపుడు టీడీపీ కూటమి ఈ విధానానికి బ్రేకులు వేస్తూ డైరెక్ట్ ఎలక్షన్స్ కి పట్టం కడుతోంది. దీని వల్ల తమ పార్టీకి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని నమ్ముతోంది. అంతే కాదు అవిశ్వాసాలు తరచూ బెదిరింపులు స్థానిక సంస్థలలో అస్థిర రాజకీయాలు క్యాంప్ పాలిటిక్స్ వంటివి ఉండకుండా చెక్ పెట్టొచ్చు అని కూడా భావిస్తోంది. దీని వల్ల కూటమికే ఎక్కువ చాన్స్ అని ఆ పార్టీ పెద్దలు అయితే అంచనా వేస్తున్నారు. అయితే నేతలు మాత్రం ఇది కొంత ఇబ్బందికరమైనదిగా అంటున్నారు. ఎలా అంటే మేయర్ జెడ్పీ చైర్మన్ వంటి కీలకమైన పదవులకు నేరుగా ఎన్నికలు పెడితే విపక్ష వైసీపీ కూడా రేసులోకి దూసుకుని వస్తుందని అంటున్నారు

వారితో సంబంధం లేదు :

అంతే కాదు వార్డులలో ఎంత మంది నెగ్గారు అన్న దానితో సంబంధం లేదని దాంతో వార్డు పదవులకు పోటీ చేసే వారు కూడా డీలా పడుతారు అని అంటున్నారు. అలాగే మేయర్ జెడ్పీ చైర్మన్ అభ్యర్థులు ముందుగా తెలిసిపోవడం వల్ల మిగిలిన వారు ఆశావహులు వారికి ఏ మేరకు సహకరిస్తారు అన్న చర్చ కూడా సాగుతోంది. అసలే మూడు పార్టీలు ఉన్న కూటమిలో గ్రౌండ్ లెవెల్ లో ఎన్నో రకాలైన సమస్యలు ఉంటాయి కదా అని గుర్తు చేస్తున్నారు.

వైసీపీ ఓకేనా :

ఇదిలా ఉంటే గ్రౌండ్ లెవెల్ లో సంస్థాగతంగా పట్టున్న పార్టీలు టీడీపీ వైసీపీ మాత్రమే. ఈ విధంగా డైరెక్ట్ ఎన్నికలు పెడితే కనుక వైసీపీ నుంచి పోటీకి సిద్ధపడిన వారు ఎక్కువ మందే ఉంటారు అని అంటున్నారు. ఒకవేళ పరోక్ష పద్ధతి అయితే వైసీపీ గెలుపు ఖాతాను రాసే చాన్స్ చాలా తక్కువ అని అంటున్నారు. ముందుగా వార్డు మెంబర్లను గెలిపించుకోవాలి, ఆ మీదట క్యాంప్ పాలిటిక్స్ చేయాలి, అధికార పార్టీ నుంచి అన్ని విధంగా తట్టుకుని నిలబడాలి, ఇన్ని చేసినా అధికార పార్టీకి ఉండే ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో వారికే గెలుపునకు ఎక్కువ చాన్స్ ఉంటుందని మొదట్లోనే కాడె వదిలేసే వారు అని అంటున్నారు.

గ్రౌండ్ లెవెల్ లో ఉన్న బలం :

ఇపుడు డైరెక్ట్ ఎన్నికలు అంటే కాస్తా ఆర్థిక బలం ఉన్న వారు అంతా వైసీపీ నుంచి మేయర్ జెడ్పీ చైర్మన్లకు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తారు అని అంటున్నారు. ఇక కూటమిలో చూసుకుంటే మిత్రుల మధ్య కో ఆర్డినేషన్ సహకారం వంటి వాటి విషయంలో అనుమానాలు కూడా ఉన్నాయని అంటున్నారు. అయితే గ్రౌండ్ లెవెల్ లో ఉన్న బలం చూసుకునే టీడీపీ డైరెక్ట్ ఎన్నికలకు తెర తీసింది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ కూడా రంగంలోకి దిగేందుకు ఈ విధానం ఉపకరిస్తుందని అంటున్నారు. అలా చూసుకుంటే కనుక ఈసారి పోటీ అంతా టీడీపీ వర్సెస్ వైసీపీగానే ఉండబోతోంది అని అంటున్నారు.

నాగబాబుకు మంత్రి హోదాతో పదవి...ఆ చాన్స్ ఎవరికి ?

హైదరాబాద్ పెన్ పవర్: జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబుని ఆయన నియమించారు. పవన్ కళ్యాణ్ చేతిలో ఉన్న పర్యావరణ, అటవీశాఖ మంత్రిత్వ శాఖల నుంచే ఈ కొత్త పోస్టుని క్రియేట్ చేశారు. ఆ విధంగా నాగబాబుకు సముచితమైన ప్రాధాన్యత కల్పించడంతో పవన్ ఎంతో ముందు చూపు ప్రదర్శించారు అని అంటున్నారు. ఇక ఈ పదవి ద్వారా ఏపీవ్యాప్తంగా పచ్చదనాన్ని విశేషంగా పెంచడమే నాబాబు నాయకత్వంలోని కమిటీ లక్ష్యంగా చెబుతున్నారు.

నాగబాబు నాయకత్వంలో :

ఇక గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ నాగబాబు నాయకత్వంలో పనిచేస్తుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను పర్యటించి పచ్చదనం పెంచడానికి పర్యావరణం సమతూల్యతను కాపాడడానికి విశేషంగా కృషి చేస్తుంది. అంతే కాదు ఏపీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం కూడా ఈ కమిటీ చూస్తుంది. అలాగే వాటి పర్యవేక్షణ బాధ్యతలను కూడా చూస్తూ ఏపీలో మొక్కల పెంపకం సమృద్ధిగా పకడ్బంధీగా జరిగేలా చూస్తుంది. దీని వల్ల పర్యావరణానికి ఎంతగానో మేలు చేకూరుతుందని భావిస్తున్నారు. ఒక విధంగా చూస్తే నాగబాబుకు ఇది ఎంతో ముఖ్యమైన బాధ్యతగా చెబుతున్నారు.

మంత్రి వర్గంలో లేనట్లే :

జనసేన అధినేత తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో నాగబాబుకు మంత్రివర్గ విస్తరణలో చోటు లేనట్లే అని అంటున్నారు. అదే సమయంలో ఆయన మంత్రిగానే ఉన్నట్లు లెక్క అని అంటున్నారు. కేబినెట్ ర్యాంక్ హోదా కాబట్టి ఆయన పదవి పవర్ ఫుల్ గానే ఉంటుందని చెబుతున్నారు. ఇక జనసేనకు ప్రామిస్ చేసిన నాలుగవ మంత్రి పదవికి ఇపుడు ఆశావహులకు మరింతగా అవకాశాలు పెరిగినట్లుగా చెబుతున్నారు. జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉంటే అందులో ముగ్గురు మంత్రులుగా ఉన్నారు. అంటే మరో 18 మందిలో ఎవరికి గోల్డెన్ చాన్స్ అన్నదే చర్చగా ఉంది. నిజానికి చూస్తే జనసేన అధినేత ఇపుడు ఆచీ తూచీ పదవుల పంపిణీ చేపడుతున్నారు. నిజానికి తలచుకుంటే నాగబాబు కేబినెట్ లో మంత్రి కావచ్చు. కానీ సామాజిక ప్రాంతీయ సమీకరణలు సరిపోవని అలాగే కుటుంబానికి పెద్ద పీట వేశారు అన్న అపప్రధ వస్తుందని భావించే ఈ విధంగా వ్యూహాత్మకంగా ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నియమించారని అంటున్నారు. ఇక బీసీలకు జనసేన పెద్ద పీట వేస్తుందని కూడా చెబుతున్నారు. అంతే కాదు ఉత్తరాంధ్రాకు ప్రయారిటీ ఇస్తుందని కూడా ప్రచారం సాగుతోంది.

కొణతాలకే లక్కీ చాన్స్ :

ఈ లెక్కలు సమీకరణలు అన్నీ చూస్తుంటే మంత్రి వర్గ విస్తరణలో జనసేనకు దక్కే కొత్త మంత్రి పదవి ఉత్తరాంధ్రాకు చెందిన కొణతాల రామక్రిష్ణకు దక్కే అవకాశాలు మరింత మెరుగు అయ్యాయని అంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి జనసేన తరఫున నలుగురు ఎమ్మెల్యేలు ఉంటే అందులో బీసీ ప్రముఖుడిగా సీనియర్ రాజకీయ నాయకుడిగా కొణతాల ముందు వరసలో ఉన్నారు. దాంతో పాటు ఆయన అనుభవం ఉత్తరాంధ్రా రాజకీయాల మీద ఉన్న పట్టు అన్నీ కలసి మినిస్టర్ చాన్స్ కి దగ్గర చేస్తున్నాయని అంటున్నారు. మొత్తం మీద నాగబాబుకూ మంత్రి హోదా దక్కింది. కొణతాలకూ చాన్స్ లభించనుంది అని ప్రచారం అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

బరువు అంతా పవన్ దేనా... పరిష్కారమేంటి ?

హైదరాబాద్ పెన్ పవర్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చుట్టూనే జనసేన అల్లుకుని ఉంది. అది సహజం కూడా. సాధారణంగా ప్రాంతీయ పార్టీలలో ఇదే విధంగా నిర్మాణం ఉంటుంది. పవన్ కి ఆ విధంగా పార్టీ బరువు బాధ్యతలు అన్నీ మోయాల్సిన అనివార్యత ఏర్పడింది. అదే సమయంలో ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. అంటే అధికారిక బాధ్యతలు కూడా ఆయనకు ఉన్నాయి. పైగా అయిదు శాఖలు. అవి కూడా ముఖ్యమైనవిగా ఉన్నాయి. దాంతో అటు పార్టీని ఇటు ప్రభుత్వాన్ని కీలక బాధ్యతలతో పవన్ ఒక విధంగా పెను భారమే మోస్తున్నారు అని అంటున్నారు. ఈ రకమైన సమస్య పవన్ ఒక్కరికేనా వైసీపీ టీడీపీలలో లేదా అంటే అక్కడ కూడా అల్టిమేట్ డెసిషన్ అధినాయకత్వానిదే. కానీ పార్టీ యంత్రాంగం పటిష్టంగా ఉంచుకున్నారు. దాంతో వారి మీద భారం తగ్గుతోంది అని అంటున్నారు.

వైసీపీ తీరు వేరుగా :

వైసీపీ విషయానికి వస్తే జగన్ పార్టీ బాధ్యతలను సీనియర్లకు అప్పచెబుతూంటారు. వారి ద్వారానే తాను వాటిని తెలుసుకుని తగిన పరిష్కారాలు చూస్తారు. టీడీపీలో అయితే అన్నీ తానై చేసుకునే అలవాటు చంద్రబాబుకు ఉంది. అయితే చంద్రబాబు సైతం సీనియర్ల టీం ని రెడీ చేసి ఉంచుతారు. అలాగే పార్టీకి విస్తృతమైన యంత్రాంగం ఉంది. అలా లాస్ట్ డెసిషన్ గా అధినాయకత్వం వద్దకు సమస్యలు ఏవైనా వస్తాయి. జనసేనలో చూస్తే అలాంటి యంత్రాంగం ఉండాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

కీలక కమిటీతోనే :

పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్నారు, మాజీ మంత్రులు ఉన్నారు. ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా పనిచేసినవారు సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న వారు కూడా జనసేనలో కనిపిస్తారు. అలాంటి వారిలో ఎంపిక చేసిన కొందరితో కమిటీని జనసేన ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచనలు వస్తున్నారు. ముఖ్యంగా ప్రతీ నియోజకవర్గం నుంచి టీడీపీ జనసేనల మధ్య కో ఆర్డినేషన్ విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. ఆధిపత్య పోరుతో ఆయా సీట్లలో సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. వాటి గురించి వచ్చే ఫిర్యాదులు కానీ లేదా వాటిని సావధానంగా ఆలకించి పరిష్కారం కనుగొనడం కానీ చేయాల్సిన బాధ్యత జనసేనకు ఉంది. అయితే అన్నీ ఇపుడు నేరుగా పవన్ కళ్యాణ్ చూడాల్సి వస్తోంది అని అంటున్నారు. అందుకే వీటిని చూసుకునే వీలుగా కమిటీని ఒక దానిని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని అంటున్నారు.

చిన్నవే పెద్దవిగా :

ఈ రోజున చిన్నవిగా ఉన్న సమస్యలే తరువాత కాలంలో పెద్ద సమస్యలుగా మారుతాయి. తమ పార్టీ వారికి నచ్చచెప్పాలి. అదే సమయంలో పార్టీ అస్తిత్వం దెబ్బ తినకుండా చూసుకోవాలి. ఇక పార్టీలో ఏమి జరుగుతోంది అన్నది గ్రౌండ్ లెవెల్ నుంచి నివేదికలు పక్కాగా ఉండాలి, వాటి మీద అధ్యయనం చేయాలి. ఇలా చాలా ఇష్యూస్ ఉంటాయి. అధినాయకుడి స్థాయిలోనే అన్నీ సాగడం అంటే కుదరని పని అంటున్నారు. అయితే జనసేనలో ఉన్న వారు అంతా పవన్ కోసమే చూస్తున్నారు. ఆయనే ఏదైనా చెప్పాలని భావిస్తున్నారు. కానీ పార్టీ అన్నాక అంచెలంచెలుగా నిర్మాణం ఉంటుంది. అలా చేసుకుంటేనే పవన్ కి పార్టీకి కూడా మేలుగా ఉంటుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే జనసేనలో మరింతగా వ్యవస్థల నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని కూడా అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

త్రిష చుట్టూ తమిళ రాజకీయం.. మరోసారి ఏఐడీఎంకే హాట్ కామెంట్స్

రాజకీయాలకు సంబంధం లేకపోయినా, తమిళ రాజకీయాలు మొత్తం ప్రముఖ నటి త్రిష చుట్టూనే తిరుగుతున్నాయి. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రిషను వీవీఐపీగా పరిగణించడాన్ని విపక్ష పార్టీలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. ఈ విషయంపై ఏఐడీఎంకే సీనియర్ నేత ఉదయకుమార్ తీవ్ర విమర్శలు చేశారు. తమిళనాడుకు పట్టిన శాపం అంటూ త్రిషపై ఘాటు విమర్శలు గుప్పించారు. వారం రోజుల క్రితం ముఖ్యమంత్రి దళపతి విజయ్ ని లక్ష్యంగా చేసుకుని విజయ్ కి ప్రియమైన త్రిషను డిప్యూటీ సీఎంగా ఎప్పుడు నియమిస్తారో చూడాలని తమిళనాడు ఎదురుచూస్తోంది అంటూ ఉదయకుమార్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఆ కామెంట్లు మరచిపోకముందే త్రిష తమిళనాడుకు పట్టిన శాపం అంటూ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు ఉదయకుమార్. ఇక సినీ నటి త్రిషపై ఏఐడీఎంకే నేత ఉదయకుమార్ విమర్శలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రాజకీయాలతో సంబంధం లేకపోయినా విపక్ష పార్టీల నేతలు త్రిషను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించడం చర్చనీయాంశం అవుతోంది. ఈ విషయంలో విపక్షంలో ఉన్న డీఎంకే, అన్నాడీఎంకే పోటీ పడుతున్నట్లు ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సైతం త్రిషపై అభ్యంతరకర విమర్శలు చేశారని ఆరోపణలు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా పోలీసులు అరెస్టు కూడా చేశారు. అయితే ఇప్పుడు అన్నాడీఎంకే కూడా తగ్గేదేలే అన్నట్లు త్రిషపై మాటల దాడి చేయడం తమిళ రాజకీయాల్లో కలకలంగా మారింది. ఆగస్టు 15 వేడుకలు సందర్భంగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, నటి త్రిష ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ముఖ్యమంత్రి విజయ్ తల్లిదండ్రులతో కలిసి స్వాతంత్ర్య వేడుకలకు హాజరైన త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జెండా ఆవిష్కరణకు వచ్చిన ముఖ్యమంత్రి విజయ్ పోలీసు గౌరవవందనం స్వీకరిస్తూ వీవీఐపీ గ్యాలరీలో కూర్చుకున్న త్రిషకు సెల్యూట్ చేయగా, ఆమె కూడా సెల్యూట్ చేస్తున్నట్లు ఫోజులిచ్చిన ఫోటోలు నెట్టింట హల్ చల్ చేశాయి. అదేవిధంగా మే నెలలో విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన సమయంలోనూ త్రిష హాజరయ్యారు. ఇక అప్పటి నుంచి విపక్షాలకు ఆమె అస్త్రంగా మారారని చెబుతున్నారు. ఎన్నికల ముందు కూడా త్రిషపై గురిపెట్టి టీవీకే అధినేత విజయ్ ని ఎదుర్కోవాలని రాజకీయ ప్రత్యర్థులు ప్రయత్నాలు చేసినట్లు చెబుతున్నారు. విజయ్ ఎన్నికల్లో గెలవాలంటే ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు రావాలనే వివాదాస్పద విమర్శలు సైతం ఆ ఎన్నికల్లో వినిపించాయి. ప్రధానంగా విజయ్, త్రిష మధ్య ఏదో సంబంధం ఉందన్న విధంగా ప్రచారం చేయాలని ప్రత్యర్థులు భావిస్తే, ప్రజలు మాత్రం ఆ విమర్శలను పట్టించుకోకుండా విజయ్ పార్టీ టీవీకేకు ఘన విజయం కట్టబెట్టారు. అయినప్పటికీ విజయ్ ప్రత్యర్థుల ఆలోచనల్లో మార్పు రాలేదని తాజాగా త్రిషపై చేస్తున్న విమర్శల బట్టి అర్థమవుతోందని అంటున్నారు.

పీఓకే భారత్‌లో భాగమవుతుంది.. ఇదే సాక్ష్యం

జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్.ఓసీ) సమీపంలో ఉన్న సరిహద్దు ప్రాంతాలలో దేశభక్తి భావనలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కుప్వారా జిల్లాలోని కేరన్ సెక్టార్‌లో స్థానిక ప్రజలు భారీ ఎత్తున చేసిన దేశభక్తి నినాదాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. భారత్‌కు అనుకూలంగా స్థానికులు నినదించిన దృశ్యాలు జాతీయ స్థాయిలో విస్తృత చర్చకు దారితీశాయి.

సరిహద్దుల్లో మిన్నంటిన ఉత్సాహం

కేరన్ ప్రాంతం నియంత్రణ రేఖకు అత్యంత సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానిక నివాసితులు "సారే జహాన్ సే అచ్చా... హిందుస్తాన్ హమారా".. "భారత్ మాతాకీ జై" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎల్.ఓసీకి ఇటువైపు భారత భూభాగంలో ప్రజలు చేసిన ఈ నినాదాలు అవతలి వైపు ఉన్న పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రాంత నివాసితులకు కూడా స్పష్టంగా వినిపించాయనే కథనాలు సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రచారమవుతున్నాయి. కశ్మీర్‌పై పాకిస్తాన్ చేసే అసత్య ప్రచారాలకు, కుట్రలకు స్థానిక ప్రజల ఐక్యతే నిజమైన సమాధానమని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

పీఓకే అంశంపై మళ్లీ మొదలైన చర్చ

ఈ క్రమంలోనే "పీఓకే భారత్‌లో భాగమవుతుంది" అనే అంశం రాజకీయ, సామాజిక వర్గాల్లో మళ్లీ చర్చనీయాంశంగా మారింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ఎల్లప్పుడూ భారతదేశంలో అంతర్భాగమేనని భారత ప్రభుత్వం, విభిన్న రాజకీయ పక్షాలు పదేపదే స్పష్టం చేస్తూనే ఉన్నాయి. కేరన్‌లో వెల్లువెత్తిన ఈ నినాదాలు భవిష్యత్తులో చోటుచేసుకునే దౌత్య, రాజకీయ పరిణామాల పట్ల ప్రజల్లో ఉన్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

మారుతున్న కశ్మీరం.. ప్రశాంతత వైపు అడుగులు

ఒకప్పుడు ఉగ్రవాదం, హింస, నిరంతర ఉద్రిక్తతలతో వార్తల్లో నిలిచే సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పుడు గణనీయమైన మార్పు కనిపిస్తోంది. శాంతిభద్రతలు మెరుగుపడటంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి, బోర్డర్ టూరిజం రూపుదిద్దుకోవడం, స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడం వంటి అంశాలు కశ్మీర్ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేశాయి. కేరన్ ప్రజలు ప్రదర్శించిన ఈ దేశభక్తిని "నూతన కశ్మీరం" నిర్మణానికి.. జాతీయ సమైక్యతకు ప్రతీకగా పలువురు అభివర్ణిస్తున్నారు.

సరిహద్దుల్లో మార్మోగిన ఈ నినాదాలు కశ్మీరీ ప్రజలకు భారతదేశంతో ఉన్న బలమైన అనుబంధాన్ని, దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలనే వారి బలమైన ఆకాంక్షను మరోసారి ప్రపంచానికి చాటిచెబుతున్నాయి.

తెలుగు రాష్ట్రాలపై దళపతి విజయ్ కన్ను? ఆసక్తికరంగా తమిళనాడు ప్రభుత్వ ప్రకటనలు!

తమిళనాడు ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సినీ సూపర్ స్టార్, దళపతి విజయ్ తన నెక్స్ట్ టార్గెట్ గా తెలుగు రాష్ట్రాలను ఎంచుకున్నారా? అనే చర్చ జరుగుతోంది. తన రాజకీయ ప్రయాణం తమిళనాడుకే పరిమితం చేయకుండా జాతీయస్థాయికి ఎదగాలనే ఆలోచనతో ఉన్న ముఖ్యమంత్రి విజయ్ అందుకు తగినట్లు అడుగులు వేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తమ వాదనకు బలం చేకూర్చేలా తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని పత్రికల్లో తమిళనాడు ప్రభుత్వ ప్రకటనలు జారీ చేయడాన్ని ఉదహరిస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా దళపతి విజయ్ ప్రభుత్వం పత్రికలకు భారీ ప్రకటనలు ఇచ్చింది. ఇలా ప్రభుత్వ విజయాలను ప్రకటలు ద్వారా పత్రికల్లో ప్రచురించడం సహజమే అయినప్పటికీ తమిళనాడు సరిహద్దులు దాటి తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషలో ప్రకటనలు జారీ చేయడమే అనేక సందేహాలకు తావిస్తోందని అంటున్నారు.ఏపీ, తెలంగాణల్లోని కొన్ని ప్రధాన పత్రికలకు తమిళనాడు ప్రభుత్వ ప్రకటనలు జారీ చేయడం చర్చనీయాంశం అవుతోంది. ఏ ఉద్దేశంతో తమిళనాడు ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల్లో ఈ ప్రచారం చేసిందనేది హాట్ టాపిక్ అవుతోంది. సినీ నటుడిగా తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న దళపతి విజయ్ ముఖ్యమంత్రిగా కూడా పాన్ ఇండియా ఇమేజ్ సంపాదించుకోవాలని భావిస్తున్నారా? అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌కు తమిళనాడులోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కూడా కోట్ల సంఖ్యలో ఫ్యాన్ బేస్ ఉంది. కేవలం సినిమా నటుడిగానే కాకుండా, ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడంతో తన నాయకత్వ ప్రభావాన్ని, ప్రతిష్టను పొరుగు రాష్ట్రాలకూ చాటుకునే ప్రయత్నంలో వ్యూహాత్మకంగా ఈ ప్రకటనలు జారీ చేసివుంటారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదేసమయంలో విజయ్ ప్రభుత్వ ప్రకటనలకు రాజకీయానికి సంబంధం ఉండదనే వాదన కూడా వినిపిస్తుంది. తమిళ, తెలుగు ప్రజలకు సంస్కృతిక, చారిత్రక సంబంధాలు ఉన్నాయని, ఆ భావోద్వేగాన్ని కొనసాగించేందుకు తెలుగు రాష్ట్రాల్లో తన ప్రభుత్వ ప్రగతిని చాటుకునే ప్రయత్నం చేశారని అంటున్నారు. తమిళనాడులో తెలుగు ఓటర్లు కూడా గణనీయంగా ఉండటం, వారికి ఇక్కడి వారితో బంధుత్వాలు ఉండటం వల్ల తన పాలనపై సానుకూల చర్చ జరిగాలనే ఆలోచన కూడా ఉండొచ్చని అంటున్నారు. ఇదే సమయంలో తన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో తెలుగు ప్రజలను ఆకర్షించి పర్యాటకాభివృద్ధికి బాటలు వేయాలనే ప్లాన్ కూడా చేశారనే వాదన కూడా వినిపిస్తోంది.

మరోవైపు పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని, ఈ పోటీలో తాను ఉన్నానని చాటుకోడానికి ఇక్కడి పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించడానికి కూడా దళపతి విజయ్ ఈ విధంగా తెలుగులో వంద రోజుల విజయంపై ప్రకటనలు జారీ చేశారని మరికొందరు విశ్లేషిస్తున్నారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, తమ రాష్ట్రంలో పెట్టుబడులు, పర్యాటకం లేదా ఇతర అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఇతర రాష్ట్రాల ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు మీడియా మార్కెటింగ్‌లో భాగంగా కూడా ఇలాంటి ప్రకటనలు ఇచ్చి ఉండవచ్చునని అంటున్నారు.

మంత్రి కాదు.. మంత్రి హోదా మాత్రమే.. నాగబాబుకు ప్రత్యేక పదవి!

ఏపీ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపడతారని భావించిన మెగా బ్రదర్ నాగబాబుకు ప్రభుత్వం ట్విస్ట్ ఇచ్చింది. ఆయనను ఏపీ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకోలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ గా నియమించింది. జనసేన శాసనమండలి సభ్యుడిగా ఉన్న నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామని రెండేళ్ల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కానీ, ఇప్పటివరకు మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడంతో నాగబాబుకు మంత్రి పదవి దక్కలేదని అంటున్నారు. అయితే ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా నాగబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ చైర్మనుగా నియమించడంతోపాటు కేబినెట్ హోదా కల్పించారు. ఈ నియామకంతో సమీప భవిష్యత్తులో నాగబాబు మంత్రి అయ్యే అవకాశాలు లేవా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.మెగా బ్రదర్ నాగబాబును ఏపీ పర్యావరణ, అటవీశాఖ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ చైర్మనుగా నియమించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. రాష్ట్ర అటవీ, పర్యావరణ మంత్రిగా ఆయన సోదరుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు పవన్ ఫోకస్ చేశారు. ఈ క్రమంలోనే అటవీ, పర్యావరణ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని అంటున్నారు. ఇదే సమయంలో తన లక్ష్యాన్ని మరింత వేగంగా చేరుకునే దిశగా చర్యలు చేపట్టిన పవన్ తన సోదరుడు నాగబాబు సహకారం తీసుకోవాలని భావించారని చెబుతున్నారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం ఉండేలా 'ఏపీ గ్రీన్' పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ లక్ష్యం నిర్దేశించారని అంటున్నారు.ఇక నాగబాబుకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించిందని చెబుతున్నారు. రాష్ట్రస్థాయిలో ఏపీ గ్రీన్ కార్యకలాపాలను పర్యవేక్షించడంతోపాటు జిల్లా స్థాయిలో పచ్చదనం అభివృద్ధి సంస్థల పనులను ఆయన చూసుకోవాల్సివుంటుందని అంటున్నారు. అటవీ విస్తరణ, పర్యావరణ పరిరక్షణలో నిర్దేశిత లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని పనిచేయాల్సివుంటుందని అంటున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న నాగబాబుకు ఈ బాధ్యతల ద్వారా మరింత బాధ్యతలు కేటాయించినట్లు అయిందని వ్యాఖ్యానిస్తున్నారు.

అయితే ఈ నియామకం సందర్భంగా నాగబాబును మంత్రిని చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీపై విస్తృత చర్చ జరుగుతోంది. 2024 డిసెంబరులో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా ప్రకటించారని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. నిజానికి 2024 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పార్లమెంటు సభ్యునిగా పోటీ చేయాలని నాగబాబు భావించారని అంటున్నారు.

అయితే ఆ సమయంలో అనూహ్యంగా బీజేపీతో పొత్తు కుదరడంతో ఆయన అనకాపల్లిని త్యాగం చేశారని, ఆ తర్వాత రాజ్యసభకు వెళ్లాలని ప్రయత్నించగా, మళ్లీ బీజేపీయే అడ్డుపడిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో కేబినెట్ మంత్రి పదవి కట్టబెడతామని చెప్పి, ఇప్పుడు ఇలా కేబినెట్ హోదాకే పరిమితం చేయడంపైనే రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబును నియమించడంతో ఇకపై ఆయనకు కేబినెట్ లో తీసుకునే అవకాశం లేనట్లేనా? అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర కేబినెట్ లో 25 మంది వరకు మంత్రులను తీసుకునే వీలుంది. కానీ ప్రస్తుత మంత్రివర్గంలో 24 మంది మాత్రమే ఉన్నారు. దీంతో మిగిలిన ఒక్క ఖాళీని నాగబాబుతో భర్తీ చేస్తారని భావించారు. అయితే ఎప్పటికప్పుడు మంత్రివర్గ విస్తరణపై ప్రచారం జరగడమే తప్ప, ఇప్పటివరకు విస్తరణ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి ఆశావహుడుగా ఉన్న నాగబాబుకు మంత్రి హోదాను కల్పిస్తూ తాజాగా చేసిన నియామకంతో ఇక మంత్రిగా తీసుకునే అవకాశం లేదని సంకేతాలు పంపినట్లు భావించాలని అంటున్నారు.

రెండు ఎమ్మెల్సీ పదవులు టీడీపీకే.. వర్ల రామయ్య పేరు ఖరారు!

గవర్నర్ కోటాలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీ నేతలతో భర్తీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉండగా, సర్దుబాటు కింద ప్రతిసారి పదవులను పంచుకుంటున్నారు. అయితే ఈ సారి పంపకాలు లేకుండా ఖాళీ అయిన రెండింటిని టీడీపీ తీసుకోవాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్సీలుగా సీనియర్ నేత వర్ల రామయ్య, రాయలసీమకు చెందిన అంగన్ వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు దళవాయి రమాదేవి పేర్లను సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు టీడీపీ నేతలు కావడంతో ఈ దఫా జనసేన, బీజేపీ నేతలకు ఎమ్మెల్సీ చాన్స్ లేనట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు.రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వర్ల రామయ్య, దళవాయి రమాదేవి పేర్లు సిఫార్సు చేసినట్లు జరుగుతున్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. ఈ పదవుల కోసం కూటమిలోని చాలా మంది నేతలు ప్రయత్నించగా, రాజకీయ, ప్రాంతీయ, సామాజిక సమీకరణాలతో ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరిలో ఒకరు ఎస్సీ, మరొకరు బీసీ కావడం గమనార్హం. వర్ల రామయ్య దశాబ్దాలుగా టీడీపీలో పనిచేస్తున్నారు. పోలీసు అధికారిగా రిటైర్ అయిన తర్వాత ఆయన 2009లో తిరుపతి పార్లమెంటు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. అప్పటి నుంచి పార్టీ కోసం నిబద్ధతగా పనిచేస్తూ వస్తున్నారు.

గతంలో ఒకసారి శాసనమండలిలో బలం లేకపోయినప్పటికీ పార్టీ ఆదేశాలతో పోటీచేసి ఓడిపోయారు. చట్టసభ సభ్యుడిగా అడుగు పెట్టాలని చాలా కాలంగా కలలు కంటున్న వర్ల రామయ్య ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించినట్లు చెబుతున్నారు. పలుమార్లు రాజ్యసభ, శాసనమండలి సభ్యుడిగా ఎంపికయ్యే అవకాశాలు వచ్చి త్రుటిలో తప్పిపోయాయి. అయితే ఈ సారి ఎలాగైనా వర్ల రామయ్యను ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని డిసైడ్ అయిన సీఎం చంద్రబాబు రెండో ఆలోచన లేకుండా ఆయన పేరు ఖరారు చేశారని అంటున్నారు. ఇక రెండో స్థానానికి బీసీ మహిళ దళవాయి రమాదేవిని ఎంపిక చేయడమే రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

రాజకీయంగా పెద్దగా గుర్తింపు లేకపోయినప్పటికీ బలహీన వర్గాలకు చెందిన మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో ఆమెను ఎంపిక చేసినట్లుగా చెబుతున్నారు. అయితే ఈ ఇద్దరి ఎంపికపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సివుందని అంటున్నారు. వర్ల రామయ్య, దళవాయి రమాదేవి పేర్లను ఎంపిక చేసినట్లు జరుగుతున్న ప్రచారం ఆశావహుల్లో గుబులు రేపుతోందని చెబుతున్నారు. వర్ల రామయ్య అభ్యర్థిత్వంపై ఎవరికీ అభ్యంతరాలు లేకపోయినప్పటికీ రాజకీయాల్లో కొత్త అయిన దళవాయి రమాదేవి పేరును పరిశీలించడమే నేతలను కలవరపాటుకు గురిచేస్తోందని అంటున్నారు. ఏదిఏమైనా సీఎం చంద్రబాబు రెండు ఎమ్మెల్సీలను భర్తీ చేసే విషయంలో ఆశావహులకు ఝలక్ ఇచ్చారని చెబుతున్నారు.

ఒత్తిడిలో ట్రంప్!

అమెరికా–ఇరాన్ యుద్ధం ఆరు నెలలు దాటుతున్న తరుణంలో, వాషింగ్టన్‌లో అంతర్గత గందరగోళం, ఒత్తిడి తారాస్థాయికి చేరుకున్నట్టు స్పష్టమవుతోంది. ఆగస్టు 16న అమెరికా మాజీ కాంగ్రెస్ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీకి చెందిన మార్జోరీ టేలర్ గ్రీన్ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. "వ్యూహాత్మక సమావేశాల్లో ఇరాన్‌పై అణ్వాయుధాల వినియోగంపై చర్చిస్తున్నారు. నేను ఊహించి చెప్పడం లేదు, నాకిది ఖచ్చితంగా తెలుసు, ఇది నిజం" అని ఆమె 'ఎక్స్' వేదికగా ఆదివారం పేర్కొన్నారు. అణుదాడులు జరిగితే ప్రపంచం మొత్తం భారీ సంఘర్షణలోకి, తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి జారిపోయే ప్రమాదముందని హెచ్చరించిన ఆమె, 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుదాడుల అనంతర పరిణామాలను గుర్తుచేస్తూ –ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నారని ప్రస్తావిస్తూ –అణుదాడులకు వ్యతిరేకంగా అమెరికన్లు గళం విప్పాలని పిలుపునిచ్చారు. అమెరికా, హర్మూజ్ జలసంధి నియంత్రణ కోసం, ఇజ్రాయెల్ హెచ్చరికల ఒత్తిడితో అణు ప్రమాణాన్ని తగ్గించే యోచనలో ఉందని ఆమె ఆరోపించారు. శ్వేతసౌధం నుంచి ఇప్పటివరకూ దీనిపై అధికారిక స్పందన రాలేదు. ఇరాన్ అణ్వాయుధం తయారీకి చేరువలో లేదని అమెరికా నిఘా వర్గాల 2025 వార్షిక ముప్పు అంచనా నివేదికే స్పష్టం చేసినా, ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి వస్తున్న హెచ్చరికల ప్రభావంతో ప్రభావితమవుతోందని గ్రీన్ ఆరోపించారు.

ఒకప్పుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా, మాగా ఉద్యమంలో కీలక నేతగా ఉన్న గ్రీన్, –ఇరాన్ అణ్వాయుధాల తయారీకి చేరువలో ఉందన్న వాదన కేవలం మిషేనిని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఆమెతోపాటు కెంటుకీకి చెందిన సెనేటర్ ర్యాండ్ పాల్ వంటివారు కూడా 'మరో ముందస్తు యుద్ధం' మొదలైందని విమర్శించగా, కాంగ్రెస్ ఆమోదం లేకుండా యుద్ధం మొదలుపెట్టడాన్ని రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ సభ్యుడు థామస్ మ్యాసీ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో, యుద్ధ వాతావరణంలో నకిలీ వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెంది, అంతర్జాతీయ దౌత్యాన్నే కలవరపెట్టగలవో చూపించే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 5న భారత్‌లోని ఒక ఎక్స్ ఖాతానుంచి, ఇరాన్ ఐఆర్‌జీసీ కమాండర్ బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిది అణుబాంబు తయారీని అంగీకరించినట్టు చూపే ఒక పోస్టు వైరల్ అయింది. ఇజ్రాయెల్, అమెరికా అణ్వాయుధాలను కలిగి ఉన్నంతకాలం తాము తమ అణు ప్రయత్నాలను వదులుకోబోమని ఆయన చెప్పినట్టు ఆ పోస్టులో పేర్కొనగా, దానికి ఏఐ రూపొందించిన అణు పరీక్ష పొగ చిత్రాన్ని కూడా జోడించారు. ఇది క్షణాల్లో ఇజ్రాయెల్ మీడియా అందిపుచ్చుకుని, తాము అణుబాంబును తయారు చేస్తున్నామని ఇరాన్ తొలిసారి బహిరంగంగా అంగీకరించిందని ప్రసారం చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా దీన్ని ఇరాన్ ఉద్దేశాలకు రుజువుగా అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్, సెనెటర్ రిక్ స్కాట్‌వంటి ప్రముఖులు కూడా ఈ పోస్టును షేర్ చేయడంతో, అమెరికా ప్రధాన మీడియాలో దీనిపై కథనాలు ప్రసారమయ్యాయి. అయితే, 'ది టైమ్స్' ఫ్యాక్ట్–చెక్‌లో ఇది పూర్తిగా నకిలీదని తేలింది. దీనిపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తమపై సాగుతున్న దుష్ప్రచారానికి ఇది మరో నిదర్శనమని, రెండు దశాబ్దాలుగా సైనిక చర్యను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ఇలాంటి కుట్రలు పన్నుతూనే ఉందని మండిపడ్డారు. నిజం బయటపడిన వెంటనే మైక్ వాల్జ్ తన పోస్టు తొలగించారు.

ఈ రెండు ఘటనలను కలిపి చూస్తే, ట్రంప్ పరిపాలన ఎదుర్కొంటున్న బహుముఖ ఒత్తిడి స్పష్టం. ఒకవైపు సొంత పార్టీలోనే యుద్ధ వ్యతిరేక స్వరాలు బలంగా వినిపిస్తున్నాయి, మరోవైపు యుద్ధాన్ని సమర్థించే వర్గం మాత్రం దీన్ని 'చారిత్రక నాయకత్వ నిర్ణయం'గా అభివర్ణిస్తోంది. యుద్ధం మొదలైనప్పుడు సెనేటర్ లిండ్సే గ్రాహం, కేటీ బ్రిట్ వంటివారు పూర్తి మద్దతు ప్రకటించగా, గ్రీన్ వంటివారు మాత్రం మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ విభజన కేవలం రాజకీయ చర్చకే పరిమితం కాదు –యుద్ధం ఆరు నెలలు దాటినా ముగింపు కనిపించకపోవడం, ఆయుధ నిల్వలు తరిగిపోవడం, చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరగడం వంటి వాస్తవ సమస్యలు ట్రంప్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ మొదట్లో ఇరాక్ తరహా సుదీర్ఘ యుద్ధంలో అమెరికా చిక్కుకునే అవకాశమే లేదని హామీ ఇచ్చినా, ఆరు నెలలు గడిచినా యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉండటం, ఆ హామీపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇలాంటి తరుణంలోనే, నిర్ధారణ లేని ఆరోపణలు, నకిలీ వార్తలు వేగంగా వ్యాప్తి చెందడం, పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ చెప్పినట్టు, "యుద్ధం కొనసాగినంత కాలం ప్రజలు భయంతోనే జీవించాల్సి ఉంటుంది" అన్న మాట ఇరు దేశాల ప్రజలకూ వర్తిస్తుంది. బాహ్య ఒత్తిడిని ఇన్నాళ్లు తట్టుకున్న ప్రభుత్వం, యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ వద్ద అణ్వాయుధాలు ఉన్నంతకాలం తామూ వాటిని సమకూర్చుకుంటూనే ఉంటామని ఇరాన్ సీనియర్ కమాండర్ జనరల్ వాహిది వ్యాఖ్యానించడం, రెండు వైపులా అణు అంశంపై పట్టువిడుపు ధోరణి కనిపించడం లేదని స్పష్టం చేస్తోంది.

ఈ మొత్తం పరిణామాల నుంచి ఒక స్పష్టమైన సందేశం వెలువడుతోంది – దీర్ఘకాలం సాగుతున్న యుద్ధం, కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగలడం లేదు, ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిని, భయాన్ని, తప్పుడు సమాచార ప్రవాహాన్ని రేకెత్తిస్తోంది. అదే సమయంలో, ఒక సాధారణ సోషల్ మీడియా పోస్టు, ప్రధాని స్థాయి వ్యక్తులను, రాయబారులను సైతం తప్పుదోవ పట్టించగలిగింది. ఇలాంటి పరిస్థితుల్లో, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ప్రకటనలు చేయడం, వాటిని వ్యాప్తి చేయడం అత్యంత ప్రమాదకరం –ఇది యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయగల, అనవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశముంది. ట్రంప్ పరిపాలన నిజంగా ఏం చేయాలనుకుంటోందో స్పష్టతలేని ఈ తరుణంలో, సొంత పార్టీనుంచే వస్తున్న హెచ్చరికలు, అంతర్జాతీయంగా వ్యాపిస్తున్న నకిలీ వార్తలు రెండూ కలిసి, అమెరికా విదేశాంగ విధానంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. శాంతి దిశగా నిజాయితీతో కూడిన అడుగులు వేయకపోతే, ఇలాంటి గందరగోళం మరింత ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం లేకపోలేదు.

పనికొచ్చే పలుకు



ఈ టాప్ సీక్రెట్ మీకు తెలుసా?

డబ్బు లేకుండా, సమయం వెచ్చించకుండా, ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా, క్షణాల్లో శరీరాన్ని, మనసును సానుకూలంగా మార్చే అద్భుతమైన రహస్యం తెలుసా? అదే –చిరునవ్వు. "నవ్వడానికి అవకాశాన్ని క్రియేట్ చేసుకోండి, ఆ నవ్వును నలుగురితో పంచుకోండి" అని ప్రముఖ అమెరికన్ రచయిత నీల్ డొనాల్డ్ వాల్ష్ చెప్పిన మాటల వెనుక లోతైన శాస్త్రీయ సత్యం దాగివుంది. చిన్న చిరునవ్వు శరీరంలోని రసాయనిక వ్యవస్థను (ఫిజియోలాజికల్ కెమిస్ట్రీ) సానుకూలంగా మారుస్తుందని ఆయన అన్న మాట కేవలం ఆధ్యాత్మిక ఉపదేశం కాదు, ఆధునిక వైద్యశాస్త్రం కూడా.

మనం నవ్వినప్పుడు మెదడులో ఎండార్ఫిన్లు, డోపమైన్, సెరోటోనిన్ వంటి 'హ్యాపీ హార్మోన్లు' విడుదలవుతాయి. ఇవి మనసును తేలికపరచడమే కాదు, శరీరంలో నొప్పిని తగ్గించే సహజ నొప్పి నివారిణులుగా పనిచేస్తాయి. అదే సమయంలో ఒత్తిడి హార్మోన్‌లైన కార్టిజాల్, అడ్రినలిన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఆసక్తికరమైన విషయమేమిటంటే, నిజంగా సంతోషంగా ఉండి నవ్వినా, లేదా కేవలం ముఖ కండరాలను నవ్వు భంగిమలో ఉంచినా, రెండు సందర్భాల్లోనూ మెదడు దాదాపు ఒకేలా స్పందిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నే 'ఫేషియల్ ఫీడ్‌బ్యాక్ హైపోథెసిస్' అంటారు. అంటే, మీకు నవ్వు రాకపోయినా, కావాలని కాసేపు నవ్వితే కూడా శరీరం సానుకూలంగా స్పందిస్తుంది. ఇక నవ్వును నలుగురితో పంచుకోవాలన్న వాల్ష్ సూచన వెనుక మరో గొప్ప సత్యముంది. నవ్వు అంటువ్యాధిలా వ్యాపిస్తుంది. మీరు నిజాయితీగా నవ్వినప్పుడు, చుట్టూ ఉన్నవారి మెదడులోని 'మిర్రర్ న్యూరాన్లు' ప్రతిబింబిస్తాయి, వారు కూడా అప్రయత్నంగా నవ్వుతారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయోజనమే కాదు, సామాజిక బంధాలను బలపరిచే శక్తివంతమైన సాధనం కూడా. ఒక కార్యాలయంలో, కుటుంబంలో, స్నేహితుల మధ్య నవ్వు పంచుకోవడం వల్ల నమ్మకం పెరుగుతుంది, ఒత్తిడి తగ్గుతుంది, సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. తెలుగు సాహిత్యంలోనూ నవ్వు గొప్పతనాన్ని కీర్తించిన సందర్భాలు కోకొల్లలు. ఒక ప్రసిద్ధ సూక్తి ఇలా చెబుతుంది – "నవ్వుతూ బతకాలి, నవ్విస్తూ బతకాలి" అని పెద్దలు అనేవారు. నవ్వుల రేడు చార్లీ చాప్లిన్ కూడా ఇలా అన్నాడు: A day without laughter is a day wasted. అంటే, నవ్వు లేని రోజు వృథా అయిన రోజే. ఈ మాటలు కేవలం భావోద్వేగపరమైన ఓదార్పు కోసం చెప్పినవి కావు, జీవన విధానాన్ని మార్చే శక్తివంతమైన సూత్రాలు.

మన నిత్య జీవితంలో ఈ సూత్రాన్ని ఎలా అన్వయించుకోవచ్చు? ఉదయం లేవగానే అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకుని ఒక చిరునవ్వు నవ్వండి. కార్యాలయంలో సహోద్యోగులతో, ఇంట్లో కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు నవ్వుతూ మాట్లాడండి. చిన్నపిల్లల నిష్కల్మష నవ్వును గమనించి, దాన్ని మీరూ అలవర్చుకోండి. ఎంత బిజీగా ఉన్నా, ఎంత ఒత్తిడిలో ఉన్నా, రోజులో కొన్ని క్షణాలైనా నిజాయితీగా నవ్వడానికి కేటాయించండి. ఇది మీ శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు, మీ చుట్టూ ఉన్నవారి జీవితాల్లోనూ వెలుగు నింపుతుంది. గుర్తుంచుకోండి –నవ్వు ఖర్చు లేని ఔషధం, కానీ దాని ప్రభావం అమూల్యం.

ఏపీలో కారిడార్ల పరుగులు!

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నమూనాలో ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. రాష్ట్రం మొత్తాన్నీ ఒకేలా అభివృద్ధి చేయాలనుకోకుండా, ప్రతి ప్రాంతానికి దాని సహజ బలాలకు అనుగుణంగా ప్రత్యేక ఆర్థిక కారిడార్లుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత ఇప్పుడు ఆచరణలోకి వస్తోంది. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ గ్రీన్ హైడ్రోజన్, పెట్రోకెమికల్స్, ఇనుము–ఉక్కు, ఐటీ, షిప్ బిల్డింగ్ రంగాలకు కేంద్రంగా రూపుదిద్దుకుంటుండగా, అమరావతి ఎకనామిక్ కారిడార్ ఫైనాన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్‌టెక్, పరిశోధన–అభివృద్ధి రంగాలకు నెలవుగా మారుతోంది. తిరుపతి ఎకనామిక్ కారిడార్ అంతరిక్ష రంగం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ, పర్యాటకంవంటి రంగాలకు కేంద్రంగా ఎదుగుతోంది. ఈ మూడు కారిడార్లతోపాటు, క్వాంటమ్ వ్యాలీ, స్పేస్ సిటీ, ఏరోస్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, ఎలక్ట్రానిక్స్ సిటీ, ఫార్మా సిటీవంటి థీమాటిక్ క్లస్టర్లు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. ఇది కేవలం ప్రణాళికా పత్రాల్లో మాత్రమే మిగిలిపోతున్న ఆలోచన కాదు. ఇప్పటికే గూగుల్ విశాఖపట్నంలో 600 ఎకరాల్లో అమెరికా వెలుపల తన అతిపెద్ద ఏఐ హబ్ ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) పెట్టుబడి పెడుతోంది, 2028 మధ్యలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అదే నగరంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 1.08 లక్షల కోట్లతో గిగా–స్కేల్ ఏఐ డేటా సెంటర్‌ను, రూ. 65,000 కోట్లతో గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాన్ని చేపడుతోంది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్–నిప్పాన్ స్టీల్ కలిసి రూ. 70,000 కోట్లతో 8.2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం గల ఉక్కు యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, ఇది లక్ష మందికిపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించనుంది. ఈ కారిడార్ ఇప్పుడు కేవలం ఒక భావనగా కాకుండా, పెట్టుబడులను ఆకర్షించే ఒక నిర్దుష్ట ఆర్థిక చోదకశక్తిగా రూపాంతరం చెందుతోంది.

కారిడార్ల వ్యూహం.. ప్రతి ప్రాంతపు ప్రత్యేకతను గుర్తించి తగినట్టుగా పరిశ్రమలను ఆకర్షించడం. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ రూ. 2,500 కోట్లతో 267 ఎకరాల్లో తయారీ యూనిట్ నెలకొల్పుతుండగా, 2028 డిసెంబర్ నాటికి కార్యకలాపాలు ప్రారంభమై 3,000 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ. 7,000 కోట్లతో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పుతూ, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుంటోంది. 2026 డిసెంబర్ నాటికే ఏసీల ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఇలాంటి ప్రాజెక్టుల కూర్పు యాదృచ్ఛికం కాదు. –ఇది కారిడార్ ఆధారిత ప్రణాళిక ఫలితమే. తాజా ప్రాజెక్టు ఆమోదాల గణాంకాలను పరిశీలిస్తే, పరిశ్రమలు–వాణిజ్యం రంగంలో 86 ప్రతిపాదనలతో రూ. 4.55 లక్షల కోట్ల పెట్టుబడి, 3.32 లక్షల ఉద్యోగాలు; ఇంధన రంగంలో 82 ప్రతిపాదనలతో రూ. 3.88 లక్షల కోట్ల పెట్టుబడి, 4.62 లక్షల ఉద్యోగాలు; ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో 52 ప్రతిపాదనలతో రూ. 2.85 లక్షల కోట్ల పెట్టుబడి కనిపిస్తోంది. ఈ సంఖ్యలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పును సూచిస్తున్నాయి. సంప్రదాయ పరిశ్రమల నుంచి భవిష్యత్ సాంకేతికతల వైపు మళ్లుతున్న దృక్పథాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయి.

ఈ కారిడార్ వ్యూహానికి పునాదిగా నిలుస్తున్నది మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చూపుతున్న చొరవ. తీరప్రాంతంలో ఐదు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. రామాయపట్నం (రూ. 4,929 కోట్లు, 34.04 ఎంఎంటీపీఏ సామర్థ్యం), మచిలీపట్నం (రూ. 5,156 కోట్లు, 35.12 ఎంఎంటీపీఏ), మూలపేట (రూ. 4,362 కోట్లు), కేజీపీఎల్ (రూ. 2,620 కోట్లు), ఏఎంఎన్‌ఎస్ క్యాప్టివ్ పోర్టు (రూ. 5,816 కోట్లు, 20.5 ఎంఎంటీపీఏ). వైమానిక రంగంలో 14 అదనపు విమానాశ్రయాలను అందుబాటులోకి తేవాలని, ప్రతి 150 కిలోమీటర్లకు ఒక విమానాశ్రయం ఉండాలని, 10 వాటర్ డ్రోమ్‌లను ప్రారంభించాలని, 2030 నాటికి ఏరోస్పేస్ తయారీలో బిలియన్ డాలర్ల పెట్టుబడిని ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతి రాజధాని నగర నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం, సుర్బానా జురాంగ్ సంస్థ సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, నాబార్డ్ నుంచి రూ. 40,887 కోట్లు ఇప్పటికే సమకూరగా, మరో రూ. 43,000 కోట్లు సమీకరించాల్సి ఉంది. రూ. 28,000 కోట్ల పెట్టుబడులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీకి అమరావతి నెలవు కానుండటం విశేషం. అంతేకాక, రాష్ట్రం రూ. 1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్‌ను వేగవంతం చేసేందుకు కొత్త పీపీపీ పాలసీ–2026ను ఆవిష్కరించి, రూ. 1,500 కోట్లను వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌గా కేటాయించడం, ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తోందో స్పష్టం చేస్తోంది.

ఈ మొత్తం వ్యూహం వెనుక ఉన్న అంతిమ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది –2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 42,000 డాలర్ల తలసరి ఆదాయంతో, 450 బిలియన్ డాలర్ల ఎగుమతులతో 'స్వర్ణాంధ్ర'గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నది నాయుడు ప్రభుత్వ దార్శనికత. ఇంతటి బృహత్తర లక్ష్యాన్ని సాధించాలంటే, కేవలం భారీ పెట్టుబడులు రావడం మాత్రమే సరిపోదు –అవి సరైన భౌగోళిక ప్రణాళికతో, స్థానిక వనరులకు అనుగుణంగా, పరస్పర అనుసంధానతతో వ్యూహాత్మకంగా వ్యాపించాలి. కారిడార్ల విధానం సరిగ్గా ఈ అవసరాన్నే తీరుస్తోంది. విశాఖపట్నం భారీ పరిశ్రమలు, ఇంధనానికి, అమరావతి భవిష్యత్ సాంకేతికతలు, పాలనకు, తిరుపతి అంతరిక్షం, రక్షణ రంగాలకు కేంద్రంగా మారడం ద్వారా, ఒక్కో ప్రాంతం తన బలాన్ని పెంచుకుంటూనే, రాష్ట్రం మొత్తానికి సమతుల్య అభివృద్ధిని అందించే అవకాశం ఏర్పడుతోంది. గూగుల్, రిలయన్స్, ఆర్సెలర్ మిట్టల్ వంటి అంతర్జాతీయ, జాతీయ దిగ్గజాలు ఇప్పటికే ఈ దార్శనికతపై విశ్వాసం ఉంచి భారీ పెట్టుబడులు పెడుతుండటం, ఏపీ కారిడార్ వ్యూహం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, వాస్తవ రూపం దాల్చుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనం. ఈ నిర్మాణాత్మక అభివృద్ధి నమూనా కొనసాగితే, రానున్న దశాబ్దాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశం మెండుగా కనిపిస్తోంది. ■



ఎప్పుడూ ప్రతికూలంగా ఆలోచించాలి. రోజంతా ఇంట్లోనే గడపాలి. సరిగ్గా నిద్రపోకపోకూడదు. ప్రతిదానికి ఫిర్యాదు చేయాలి. సమస్యలకు ఇతరులను నిందించాలి. ప్రాసెస్ చేసిన జంక్ ఫుడ్ తినాలి. ఉదయాన్నే ఫోన్ చూస్తూ గడిపేయాలి. భయాలు-నెగెటివిటీని వ్యాప్తి చేసేవారినే అనుసరించాలి. ఇవన్నీ చెప్తే -కోపమొస్తుంది కదూ! ఇవన్నీ జీవితాన్ని నాశనం చేస్తాయని మీకూ తెలుసు కదూ. మరి మంచి జీవితం కావాలనుకుంటే.. -సింపుల్, వీటికి పూర్తి విరుద్ధమైన అలవాట్లు చేసుకోండి. లేదూ శారీరక వ్యాయామంపై దృష్టిపెట్టండి. అన్నీ.. వాటంతట అవే వస్తాయి.

-మహాదేవ

వింతల్లో వింతలు

ఎలుకతో ఎబ్బెట్టు ఫ్యాషన్



ఆస్ట్రేలియాకు చెందిన 'రాట్ ఆడిటీ గిజార్డ్' అనే వింత వస్తువుల బొటిక్, నిజమైన టాక్సిడెర్మీ (సంరక్షిత) ఎలుకలను కుట్టిన మహిళల లోదుస్తుల శ్రేణితో నెట్టింట తీవ్ర దుమారం రేపింది. గత అక్టోబర్‌లో బ్రాండ్ డిజైనర్‌కు వచ్చిన ఈ 'అద్భుతమైన' (కొందరి దృష్టిలో 'జుగుప్సాకరమైన') ఆలోచన, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వెంటనే వైరల్‌గా మారింది. 'లింజ్‌రాట్' పేరుతో రూపొందించిన ఈ దుస్తులు ధరించడానికి ఉద్దేశించినవి కాదని డిజైనర్ స్పష్టం చేసినా, తమ భాగస్వాములను ఆశ్చర్యపరచడానికో లేదా భయపెట్టడానికో వీటిని ధరించాలని కొందరు ఉత్సాహం చూపడం విశేషం. ఒక్కో జత ధర ఏకంగా 190 ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 11,400). ఎలుకల మూలం గురించి పారదర్శకంగా వివరణ ఇచ్చినప్పటికీ, ఈ ఉత్పత్తులు తీవ్ర విమర్శలను, వివాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా షిప్పింగ్ సదుపాయం కూడా అందిస్తున్న ఈ బ్రాండ్, షాక్ వాల్యూతో అందరి దృష్టిని ఆకర్షించడంలో మాత్రం విజయం సాధించింది!

పొట్టలో మెదడు



జీర్ణకోశ వ్యవస్థలో పేగులు (గట్) ఒక భాగమే కావచ్చు. కానీ వీటి పరిమితి అంతటితోనే ఆగిపోదు. 'రెండో మెదడు'గానూ వ్యవహరిస్తుంటాయి. అలాగని మెదడు మాదిరిగా ఆలోచన, వివేచన, కార్యకారణ విచక్షణ వంటి పనులు చేస్తుందని కాదు. నాడులు, నాడీ సమాచార వాహకాలు, హార్మోన్లు, కోట్లాది సూక్ష్మక్రిములు, రోగనిరోధక సంకేతాల ద్వారా నిరంతరం మెదడుతో అనుసంధాన మవుతాయి. ఆ మాటకొస్తే కొన్ని విషయాల్లో మెదడునూ నియంత్రిస్తుంటాయి. అందుకే పేగు-మెదడు చక్రం (గట్ బ్రెయిన్ యాక్సిస్) మీద ఆసక్తి పెరుగుతోంది. ఇది జీర్ణక్రియ, మానసిక స్థితి, ఒత్తిడి, నిద్ర, తిండి మీద యావ దగ్గరి నుంచి మొత్తంగా ఆరోగ్యం వరకూ అన్నింటితోనూ ముడిపడి ఉంటుండటం గమనార్హం.

మన శరీరానికి మెదడే నియంత్రణ కేంద్రమని భావిస్తూ వస్తున్నాం. దీనిలోని రసాయనాల చర్యలతోనే అన్ని భాగాలకు సంకేతాలు అందుతాయని అనుకుంటున్నాం. కానీ ఇప్పుడీ పరిస్థితి మారుతోంది. భావోద్వేగాలు, విషయగ్రహణ, రోగనిరోధకత వంటివన్నీ పేగుల్లో మొదలవుతున్నాయనే భావన పెరుగుతోంది. మనం భయం, ఆందోళనలకు గురైనప్పుడు కడుపులో గుబులు రేగటం, విరేచనం కావటం తెలిసిందే. కుంగుబాటు, దిగులుకు లోనైనప్పుడు మలబద్ధకం తలెత్తటం చూస్తూనే ఉంటాం. పొట్టలో ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు లేకపోయినా, పేగుల్లో లోపాలు లేకపోయినా ఇలాంటి అనుభూతి చెందటం మామూలే. దీనికి మూలం పేగు, మెదడు మధ్య నిరంతరం సాగే సమాచార ప్రసారమే. ఇది రెండు వైపులా జరిగే ప్రక్రియ. ఒకటి ప్రభావితమైతే రెండోదీ ప్రతిస్పందిస్తుంటుంది. ఇందులో పేగుల్లోని విశిష్ట నాడీ వ్యవస్థతో పాటు సూక్ష్మక్రిముల సమూహం (మైక్రోబియం) కీలక పాత్ర పోషిస్తుంటాయి.

తొలి మెదడు పేగే!

ఇప్పుడు పేగును రెండో మెదడుగా భావిస్తున్నారు గానీ నిజానికి తొలి మెదడు ఇదేనని చెప్పుకోవచ్చు. పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే- జీవుల్లో మెదడు, వెన్నుపాము కన్నా ముందే పేగులు రూపుదిద్దుకున్నాయని తెలుస్తుంది. ఒకప్పుడు జంతువుల్లో చిన్న మెదడు మాత్రమే ఉండేది. నెమ్మదిగా పూర్తిస్థాయిలో వృద్ధి చెందింది. అయినా ఇప్పటికీ మెదడును పేగులు శాసిస్తుండటం గమనార్హం. పేగుల్లోని బ్యాక్టీరియా, వీటి నుంచి పుట్టుకొచ్చే పదార్థాలు దీన్ని ఆజమాయిషీ చేస్తుంటాయి.

సూక్ష్మక్రిముల మాయ

పేగుల్లో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వంటి బోలెడన్ని సూక్ష్మక్రిములు (మైక్రోబయోమ్) నివసిస్తుంటాయి. ఇవి పేగుల్లోని కణాలకు సంకేతాలు ఇవ్వటం ద్వారా చాలారకాల రసాయనాలను విడుదలయ్యేలా చేస్తుంటాయి. అన్నింటికన్నా ముఖ్యమైనవి సెరొటోనిన్, డోపమిన్ అనే నాడీ సమాచార వాహకాలు. శరీరంలోని సెరొటోనిన్‌లో సుమారు 95% పేగుల్లోనే ఉత్పత్తి అవుతుంది. మెదడుకు ఆవల డోపమిన్ ఉత్పత్తిలోనూ పేగుల పాత్రే అధికం. సెరొటోనిన్ ఆనందం, ఉల్లాసం కలిగిస్తుంది. ఇది తగ్గితే విచారం, ఆందోళన తలెత్తుతాయి. డోపమిన్ ఉత్సాహ హార్మోన్. ఆహ్లాద ప్రవర్తన, తృప్తిని కలిగిస్తుంది. కాకపోతే ఒక తిరకాసుంది. మరీ ఎక్కువైతే ఉద్రిక్త స్వభావం, అసాధారణ ప్రవర్తన, వ్యసనాలకు దారితీస్తుంది. అందువల్ల ఇవి సమతులంగా ఉండటం చాలా కీలకం. ఇక్కడే పేగు బ్యాక్టీరియా కీలక పాత్ర పోషిస్తుంది. వీటి ప్రేరణతో పుట్టుకొచ్చే సెరొటోనిన్, డోపమిన్ నేరుగా మెదడులోకి చేరుకోవు గానీ వేగస్ నాడి, రోగనిరోధక మార్గాలు, సూక్ష్మక్రిముల పదార్థాల ద్వారా మెదడుకు సంకేతాలు పంపటం ద్వారా పెద్ద ప్రభావమే చూపుతాయి. కుంగుబాటు, కోపం, నేరాలకు పాల్పడేవారు, ఆటిజమ్ గలవారిలో పేగు బ్యాక్టీరియా భిన్నంగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

అధిక బరువు తగ్గేలా..

మధుమేహానికి ఉద్దేశించిన జీఎల్‌పీ-1 రిసెప్టర్ ఎగొనిస్ట్ మందులతో బరువూ తగ్గుతుండటంతో ఊబకాయ చికిత్సకూ వాడుకుంటున్నారు. ఇవి శరీరంలో సహజంగా ఉత్పత్తయ్యే జీఎల్‌పీ-1 హార్మోన్‌నే అనుకరిస్తాయి. ఇది ప్రధానంగా పేగుల నుంచే విడుదలవుతుంది. ఆకలిని తగ్గించటం, జీర్ణక్రియ నెమ్మదిగా సాగేలా చేయటం దీని పని. తిండి మీద యావ తగ్గటమూ పేగు సంకేతాలతో ముడిపడి ఉంటోంది. ఆకలిని పుట్టించే ఘ్రెలిన్ హార్మోన్ జీర్ణాశయం, చిన్నపేగుల్లోనే పెద్దమొత్తంలో ఉత్పత్తి అవుతుంది. ఇది రక్తం ద్వారా మెదడుకు చేరుకొని, ఆహారం తినేలా పురికొల్పుతుంది. దీనికి వ్యతిరేకంగా పనిచేసేది లెప్టిన్ హార్మోన్. కడుపు నిండిందని, ఇక తినటం ఆపేయ్యాలని సంకేతాలివ్వటం దీని ప్రత్యేకత. ఇది ప్రధానంగా కొవ్వు కణాల నుంచి ఉత్పత్తి అయినప్పటికీ కొంత జీర్ణాశయం నుంచీ విడుదలవుతుంది. ఘ్రెలిన్ ఎక్కువై, లెప్టిన్ తక్కువైతే తిండి మీద యావ పెరుగుతుంది. ఫలితంగా ఎక్కువెక్కువ తినటానికి, అధిక బరువుకు దారితీస్తుంది. ఈ రెండు హార్మోన్లనూ పేగు బ్యాక్టీరియా నుంచి పుట్టుకొచ్చే షార్ట్ చెయిన్ కొవ్వు ఆమ్లాలే నియంత్రిస్తుండటం గమనార్హం. అంటే బరువు తగ్గే ప్రక్రియ ముందు పేగుల్లోనే మొదలవుతుందన్నమాట.

రోగనిరోధకశక్తికి ఊతం

పేగుల్లో ప్రత్యేక యాంటీబాడీలుంటాయి. వీటికి బ్యాక్టీరియా శిక్షణ ఇస్తుంది. దీని మూలంగానే అవి ప్రేరేపితం కావటం, చురుకుగా ఉండటం సాధ్యమవుతుంది. ప్రయోగాల కోసం సృష్టించే సూక్ష్మక్రిములు లేని ఎలుకలు బయటి వాతావరణంలో బతకలేవు. దీనికి కారణం పేగుల్లో ఎలాంటి బ్యాక్టీరియా లేకపోవటమే. నిజానికి మనం పుట్టినప్పటి నుంచే పేగుల్లోని బ్యాక్టీరియా సాయంతో రోగనిరోధక వ్యవస్థ తర్ఫీదు పొందుతుంది. ఇన్‌ఫెక్షన్లతో పోరాడటం నేర్చుకుంటుంది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మన పిల్లలు ఇన్‌ఫెక్షన్లను బాగా ఎదుర్కోవటానికి రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండటమే కారణం. ఇందుకు పేగుల్లోని బ్యాక్టీరియా వైవిధ్యమే తోడ్పడుతోంది.

జీవనశైలితో కాపాడుకోవచ్చు

పేగు-మెదడు మధ్య చక్రం అస్తవ్యస్తం కాకుండా చూసుకోవటం మన చేతుల్లోనే ఉంది. ఇందుకు జీవనశైలి మార్పులు బాగా ఉపయోగపడతాయి. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధికి పీచు పదార్థం తోడ్పడుతుంది. కాబట్టి పండ్లు, కూరగాయలు, గింజపప్పులు, చిరుధాన్యాలు, విత్తనాలు, చిక్కుళ్లతో కూడిన సమతులాహారం తినటం మంచిది. మనం ఆహారం ద్వారా తీసుకున్న చక్కెరలను చాలావరకూ చిన్న పేగులే శోషించుకుంటాయి. కానీ పీచు అంత త్వరగా జీర్ణం కాదు. పెద్దపేగులోకి చేరుకొని, అక్కడి మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతుంది. తగినంత పీచు అందుబాటులో లేకపోతే మంచి బ్యాక్టీరియా చనిపోయి, చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందటం మొదలెడుతుంది. కాకపోతే మితం పాటించాలి. సజీవ బ్యాక్టీరియాతో కూడిన పెరుగు, మజ్జిగ కూడా మేలు చేస్తాయి. పులిసిన పిండితో చేసే ఇడ్లీ, దోసె వంటివీ మంచివే. అయితే మాంసం, మిఠాయిలు, వేపుళ్లు, చిప్స్ వంటి జంక్‌ఫుడ్, వేరుశనగలు, పాల వంటివి మేలిరకం బ్యాక్టీరియాకు అంత మంచివి కావు. కొందరు మంచి బ్యాక్టీరియా కోసం ప్రొబయాటిక్ మాత్రలు వేసుకుంటుంటారు. వీటితో అంత ఉపయోగం ఉండదు. మాత్రల్లో ఒక్క బ్యాక్టీరియా మాత్రమే ఉంటుంది. విరేచనాలు పట్టుకున్నప్పుడో, యాంటీబయాటిక్ మాత్రలు వాడిన తర్వాతో కొద్దిరోజుల పాటు వేసుకోవచ్చు. రెండు వారాల కన్నా మించి వాడకూడదు. నీరు రోజుకు 3 లీటర్ల వరకు తాగాలి. లేకపోతే బ్యాక్టీరియాలో నీటిశాతం తగ్గి, ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. పీచు పదార్థం తీసుకునేటప్పుడు ఇది మరింత ముఖ్యం. పీచు మోతాదును గణనీయంగా పెంచి, తగినంత నీరు తాగకపోతే కడుపుబ్బరం, కడుపునొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. తగినంత శారీరక శ్రమ చేయాలి. ఇది రక్త ప్రసరణ పెంచటం, జీర్ణకోశ కండరాలను బలోపేతం చేయటం, జీవక్రియలను మెరుగుపరచటం ద్వారా పేగుల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దీంతో మంచి బ్యాక్టీరియా కూడా వృద్ధి చెందుతుంది. రాత్రిపూట మెలకువగా ఉంటే పేగుల్లోని సూక్ష్మక్రిములు చిరాకు పడతాయి. దీంతో నిద్ర పట్టటానికి తోడ్పడే సెరొటోనిన్, మెలటోనిన్, గాబా వంటి రసాయనాల ఉత్పత్తి అస్తవ్యస్తమవుతుంది. ఇది నిద్రలేమిని మరింత తీవ్రం చేస్తుంది. కాబట్టి రాత్రిపూట 7-9 గంటలు నిద్రించటం మంచిది.

పొగ, మద్యం జోలికి అసలే వెళ్లొద్దు. ఇవి మంచి బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. హానికారక సూక్ష్మక్రిములు ఎక్కువయ్యేలా చేస్తాయి. పేగుల లోపలి గోడ కూడా దెబ్బతింటుంది. దీంతో కణాల మధ్య ఖాళీ ఏర్పడి (లీకీ గట్) యాంటీజెన్స్, బ్యాక్టీరియా కణాలు లోపలికి వెళ్తాయి. ఆయా భాగాల్లో రోగనిరోధక కణాలను ప్రేరేపించి, రకరకాల సమస్యలకు దారితీస్తాయి.

నాడీ వ్యవస్థ ప్రత్యేకం

పేగుల్లో ప్రత్యేకమైన నాడీ వ్యవస్థ కొలువై ఉంటుంది. దీన్నే ఎంటరిక్ నర్వస్ సిస్టమ్ (ఈఎన్ఎస్) అని పిలుచుకుంటారు. అన్నవాహిక నుంచి మలాశయం వరకూ విస్తరించే దీనిలో 10 కోట్లకు పైగా నాడీకణాలు ఉంటాయి! మెదడు నుంచి జీర్ణకోశానికి వెళ్లే నాడులు.. ముఖ్యంగా వేగస్ నాడి నుంచి వీటికి నిరంతరం సంకేతాలు అందుతుంటాయి. ఆహారం మింగుడు పడటం, తిన్న ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌ల విడుదల, పోషకాలను గ్రహించుకునేలా, వ్యర్థాలను విసర్జించేలా చేయటానికి తోడ్పడే రక్త ప్రసరణ నియంత్రణ వంటివన్నీ దీని చలవే. అంతేకాదు.. పేగుపూత (ఐబీఎస్), మలబద్ధకం, విరేచనాలు, కడుపుబ్బరం, కడుపునొప్పితో బాధపడేవారిలో భావోద్వేగాల మీదా గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఇలాంటి సమస్యలకు కుంగుబాటు, ఆందోళన కారణమవుతున్నాయని ఇప్పటివరకూ భావిస్తున్నారు

ఆధ్యాత్మికం : ఇంట్లో కర్పూరం వెలిగిస్తే నెగటివ్ ఎనర్జీ పోతుందా..

కర్పూరానికి అంత శక్తి ఉందా..?

హిందువులు పూజలు చేస్తుంటారు. కొంతమంది రోజు పూజ చేస్తారు.. మరికొందరు వారానికొకసారి .. ఇంకొందరు .. పండగకో.. పబ్బానికోచేస్తారు. పూజ చివరిలో కర్పూరం వెలిగిస్తారు. ఆధ్యాత్మిక గ్రంధాల ప్రకారం.. హారతి ఇచ్చిన తరువాతనే పూజ సంపూర్ణంగా ముగిసిందని భావిస్తారు. పూజలో కర్పూర హారతికి ఎందుకు అంత ప్రాధాన్యత ఉందో తెలుసుకుందాం..

పూజ చేసేటప్పుడు ఉపయోగించే వస్తువులన్నింటికి శాస్త్రీయ పరంగా.. ఆరోగ్య పరంగా కూడా చాలాఉపయోగాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పూజలో కర్పూరం వెలిగించడం వలన ఇంట్లో ఉండే హానికరమైన బ్యాక్టీరియా నశిస్తుంది. అంతే కాకుండా ఇంట్లో ప్రతికూల శక్తి పాజిటివ్?గా మారుతుందని పండితులు చెబుతున్నారు.

ఆయుర్వేద వైద్యంలో కర్పూరానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. సహజ సిద్ద పద్దతిలో దీనికి తయారు చేసేవారు ఆవుపేడను.. మోదుగు.. జమ్మి.. రావి.. పుల్లలను .. ఉపయోగిస్తారు. వీటిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. వీటితో తయారు చేసిన కర్పూరం పొగ... పీల్చితే శ్వాశకోస వ్యాధులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. మరో ముఖ్య విషయం ఏంటంటే.. కర్పూరాన్ని మెత్తగా మిక్సీ చేసి.. నీటిలో కలిపి నేలను తుడిస్తే చీమలు... బ్యాక్టీరియా .. ఇతర హాని కీటకాలు ఉండవు. ఇంట్లో కర్పూరాన్ని గాజు పాత్రలో ఉంచడం వల్ల స్వచ్ఛమైన గాలి ప్రసరిస్తుందని చెబుతున్నారు. ప్రతి రోజు కర్పూరాన్ని వెలిగించడం వలన ఇంట్లో ఉండే చెడుగాలి బయటకు వెళ్లి పర్యావరణం స్వచ్ఛంగా మారుతుంది.కర్పూరాన్ని వెలిగించడం వలన గాలిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. అందుకే కలుషిత ప్రాంతాలలో నివసించే ప్రజలు వ్యాధులను నివారించడానికి కర్పూరాన్ని వెలిగించాలని చెబుతున్నారు.

సహజంగా రాత్రి సమయంలో ప్రతికూల శక్తులు తిరుగుతుంటాయని పండితులు చెబుతుంటారు. ఆధ్యాత్మిక నిపుణులు తెలిపిన వివరాలప్రకారం సాయంత్రం కర్పూరం వెలిగిస్తే.. ఆ పొగ ప్రభావంతో ఇంట్లోకి అలాంటి రావని నమ్ముతుంటారు.

ఇది తింటే ఎక్కువకాలం బతుకుతారు...

హైటెక్? యుగంలో పొద్దున లేచిన దగ్గరి నుంచి పడుకోనేంత వరకు బిజీ..బీజీ.. ఈ లైఫ్? లో వేళకాని వేళల్లో ఆహారం తీసుకోవడం, వ్యాయామానికి దూరంగా ఉండటం మొదలైన కారణాలతో చాలామంది బరువు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువు కారణంగా ఊబకాయ సమస్యలు తలెత్తి జీవితాంతం అనారోగ్యంతో బాధపడుతూనే ఉంటున్నారు. అలాంటి వాళ్లు పండుమిర్చి తింటే బరువు తగ్గడంతో పాటు ఆయుష్షు కూడా పెరుగుతుందంటున్నారు పరిశోధకులు. పండు మిరపకాయలను తరచూ తినడం వల్ల అధిక బరుపు తగ్గించుకోవచ్చని అమెరికాలోని వెర్మోంట్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు.. పదహారు వేల మందిపై పరిశోధనలు చేసిన సైంటిస్టులుతరచూ పండు

మిరపకాయలు తినడం వల్ల బరువు తగ్గుతారని నిర్ధారించారు. అంతేకాదు ఇవి తినడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. దీనిలో ఉండే క్యాప్సైసిన్ అనే పదార్థం యాంటీ ఆక్సిడెంట్ పని చేసి శరీరంలోని బ్యాక్టీరియా, ఇతర క్రిములను నాశనం చేస్తుంది. దీని ద్వారా మనిషి ఆయుష్షు కూడా పెరుగుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

గాలే టెస్టు: భారత బౌలర్ల ధాటికి లంక తడబాటు

భారత్‌తో తొలి టెస్టులో కష్టాల్లో శ్రీలంక

మూడో రోజు ఆట ముగిసేసరికి 272/7 స్కోరు

కీలక ఇన్నింగ్స్ ఆడిన నిరోషన్ డిక్వెలా (80)

సెంచరీకి ఒక్క పరుగు దూరంలో సోనల్ దినూష (99బి)

భారత్‌కు ఇంకా 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

హైదరాబాద్ పెన్ పవర్: గాలే వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక కష్టాల్లో పడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. యువ బ్యాటర్ సోనల్ దినూష (99 బ్యాటింగ్) సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో అజేయంగా నిలిచాడు. భారత జట్టు కంటే శ్రీలంక ఇంకా 190 పరుగులు వెనుకబడి ఉంది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ లో 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌట్ అయింది.భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సమాధానంగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో డకౌట్ కాగా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో 90 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట పరిస్థితుల్లో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెలా (80), సోనల్ దినూష కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. 115 బంతుల్లో 7 ఫోర్లతో 80 పరుగులు చేసిన డిక్వెలాను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదించాడు.అయితే,ద

మరో ఎండ్‌లో సోనల్ దినూష ఓపిగ్గా ఆడుతూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 163 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 99 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం అతనితో పాటు ప్రభాత్ జయసూర్య (9బి) బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. నాలుగో రోజు ఆటలో దినూష సెంచరీ పూర్తి చేసుకుని, లోయర్ ఆర్డర్‌తో కలిసి ఆధిక్యాన్ని ఎంతవరకు తగ్గిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తాడో బీసీసీఐనే డిసైడ్ చేయాలా?.. ఫుల్ పవర్ ఇవ్వాలంటూ డిమాండ్!

హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్‌లో రోజు రోజుకూ ఊపందుకుంటున్న ప్లేయర్ ట్రేడింగ్ వ్యవహారాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌ను వీడి మరో జట్టులోకి వెళ్తాడనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్న వేళ, టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ బీసీసీఐ జోక్యంపై తీవ్రంగా మండిపడ్డాడు. హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తున్నాడు ఎంతకు ట్రేడింగ్ జరుగుతోంది? అనే విషయాలు కేవలం రెండు ఫ్రాంచైజీలు, ఆ ప్లేయర్, బీసీసీఐకి మాత్రమే తెలియకుండా.. బోర్డే పూర్తి పవర్స్ తీసుకుని పారదర్శకమైన ఆర్థిక లావాదేవీలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సన్నీ స్పష్టం చేశారు. మిడ్-డే పత్రికలోని తన తాజా కాలమ్‌లో సునీల్ గావస్కర్ ఐపీఎల్ ట్రేడింగ్ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. ట్రేడింగ్ విండో సమయంలో ఒక ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి ఆటగాళ్లు మారినప్పుడు దానికి సంబంధించిన నగదు లావాదేవీలు, డీల్ రూల్స్ రహస్యంగా ఎందుకు ఉంచుతున్నారని బీసీసీఐని ప్రశ్నించారు. ఈ డీల్ వివరాలు కేవలం బీసీసీఐ, ప్లేయర్, సంబంధిత ఫ్రాంచైజీల దగ్గర మాత్రమే ఉండటంతో మిగిలిన జట్లకు ఎలాంటి సమాచారం ఉండటం లేదని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద లీగ్ అయిన ఐపీఎల్ పారదర్శకతను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు.

ఐపీఎల్ లో పారదర్శకతే ఏకైక మార్గం:

ఐపీఎల్‌లో ప్రతి ఫ్రాంచైజీ తమ జట్టును నిర్మించుకోవడానికి ఒక శాలరీ క్యాప్ (పరిమితి) ఉంటుంది. అయితే ట్రేడింగ్ సమయంలో బదిలీ అయ్యే కోట్ల రూపాయల వివరాలు బయటకు రాకపోవడంతో ఏ జట్టు కూడా శాలరీ క్యాప్ నిబంధనలను దాటలేదని ఇతర ఫ్రాంచైజీలు నిర్ధారించుకోలేకపోతున్నాయని సునీల్ గావస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. లీగ్‌పై అనవసర విమర్శలు రాకుండా ఉండాలంటే బీసీసీఐ నేరుగా నిబంధనలను కఠినతరం చేసి, ట్రేడింగ్ జరిగే అన్ని ఆర్థిక లావాదేవీలని బహిర్గతం చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

కెప్టెన్సీ ఇస్తేనే ట్రేడింగ్.. హార్దిక్ కీలక షరతు:

2024లో గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారిన హార్దిక్ పాండ్యా.. అక్కడ ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, అభిమానుల వ్యతిరేకత కారణంగా ముంబైని వీడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 కంటే ముందే ముంబైని వదిలి కోల్‌కతా నైట్ రైడర్స్ , చెన్నై సూపర్ కింగ్స్ లేదా గుజరాత్ టైటాన్స్ వైపు వెళ్లేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు పాండ్యా. ఏ జట్టులోకి వెళ్లినా తనకు కెప్టెన్సీ ఇవ్వాలనే ఏకైక షరతుతో హార్దిక్ ట్రేడింగ్ చర్చలు జరుపుతుండటం ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారింది.

ధోనీకి నో ఛాన్స్?: కెప్టెన్‌గా అదుర్స్, కోచ్‌గా మాత్రం వద్దు.. చెన్నై సూపర్ కింగ్స్ జ హెడ్ కోచ్‌గా అతడే బెస్ట్

హైదరాబాద్ పెన్ పవర్: చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గత 18 సీజన్లుగా తమ హెడ్ కోచ్‌గా వ్యవహరించిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో విడిపోయిన తర్వాత కొత్త కోచ్ వేటను వేగవంతం చేసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ 2019 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సీఎస్‌కే నయా కోచ్‌గా వచ్చే అవకాశం ఉందంటూ భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. మోర్గాన్ పేరు ఫ్రాంచైజీ వర్గాల్లో బలంగా వినిపిస్తోందని, దీనిపై ప్రాథమిక చర్చలు కూడా జరుగుతున్నాయని అశ్విన్ వెల్లడించాడు.

మోర్గాన్, మెక్‌కలమ్ వద్దే వద్దు: శ్రీకాంత్

రవింద్రన్ అశ్విన్ ప్రతిపాదనను భారత జట్టు మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. ఇయాన్ మోర్గాన్‌ను కానీ, బ్రెండన్ మెక్‌కలమ్‌ను కానీ సీఎస్‌కే హెడ్ కోచ్‌గా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మోర్గాన్ ఇంగ్లాండ్‌కు మంచి కెప్టెనే కావచ్చు కానీ, ఐపీఎల్‌లో కేకేఆర్ కెప్టెన్‌గా గొప్పగా ఏమీ సాధించలేదని, అతడు కా కామెంట్రీకే పరిమితమైతే బెటర్ అని శ్రీకాంత్ ఎద్దేవా చేశారు.

మైఖేల్ హస్సీయే పర్ఫెక్ట్ ఛాయిస్:

బయట నుంచి ఎవరినో తీసుకురావాల్సిన అవసరం చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు లేదని, ప్రస్తుతం జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న మిస్టర్ క్రికెట్ మైఖేల్ హస్సీనే ఆటోమేటిక్‌గా హెడ్ కోచ్‌గా నియమించాలని శ్రీకాంత్ సూచించారు. హస్సీకి సీఎస్‌కే సంస్కృతిపై సంపూర్ణ అవగాహన ఉందని, జట్టును నడిపించేందుకు అతడే అత్యుత్తమ ఎంపిక అని పేర్కొన్నారు. కేకేఆర్‌ను 2021లో ఫైనల్‌కు తీసుకెళ్లిన అనుభవం మెక్‌కలమ్‌కు ఉన్నప్పటికీ, ఆయన శైలి సీఎస్‌కేకు సరిపోదని అభిప్రాయపడ్డారు.

ముందు ఎంఎస్ ధోనీ రోల్ తేలాలి:

కొత్త కోచ్ నియామకానికంటే ముందు చెన్నై జట్టులో ది గ్రేట్ మిస్టర్ కూల్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తు ఏంటి అనేది తేలాలని మాజీ క్రికెటర్ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ధోనీ పాత్ర ఏంటి? అతడు ఏ హోదాలో ఉంటాడు? అనే విషయంపై ముందుగా స్పష్టత రావాలని చెప్పారు. ధోనీ రోల్‌పై క్లారిటీ వచ్చిన తర్వాతే కొత్త హెడ్ కోచ్ నియామకం, జట్టు భవిష్యత్తు ప్రణాళికలు ముందుకు కొనసాగుతాయని క్రిష్ స్పష్టం చేశారు.

ప్రత్యేకమైన కట్-అవుట్ డిజైన్ దుస్తుల్లో నిధి అగర్వాల్ మెరుపులు

పసుపు చీరలో ఏజ్‌లెస్ క్వీన్ త్రిష కృష్ణన్

దక్షిణాది సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా తన ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న పాపులర్ నటి త్రిష కృష్ణన్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయబద్ధమైన పసుపు రంగు చీర ధరించి దేవకన్యలా మెరిసిపోతున్న తన ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. విశేషమేమిటంటే ఆ చీర తన తల్లిదేనని తెలిపి అభిమానులను మురిపించారు. ఈ రాయల్ లుక్‌లో త్రిషను చూసిన అభిమానులు, నెటిజన్లు -ఏజ్‌లెస్ క్వీన్- అని ప్రశంసిస్తున్నారు.నాలుగు పదుల వయసుకు చేరువవుతున్నా త్రిష గ్లామర్ లో కించిత్ కూడా మార్పు రాలేదని.. రోజురోజుకూ ఆమె మరింత అందంగా తయారవుతున్నారని అభిమానులు మురిసిపోతున్నారు. నటి ఖుష్బూ సుందర్, ఐశ్వర్య కల్పాతి సహా పలువురు సినీ ప్రముఖులు త్రిష అలంకరణకు.. తన అందమైన రూపానికి ఫిదా అయిపోయి ప్రశంసలను కురిపించారు. కొందరు నెటిజన్లు త్రిష క్లాసిక్ సినిమాల్లోని డైలాగులను గుర్తుచేసుకుంటూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి తెచ్చారు.మరోవైపు ఈ పోస్ట్ కింద నెటిజన్ల మధ్య తీవ్రమైన రాజకీయ, వ్యక్తిగత చర్చలు కూడా వేడెక్కిస్తున్నాయి. ముఖ్యంగా దళపతి విజయ్ సారథ్యంలోని పొలిటికల్ మీటింగ్‌లు లేదా తమిళనాడు ప్రభుత్వ సభల్లో త్రిష కనిపించడంపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు అభిమానులు త్రిషను సరదాగా విజయ్ కి చెల్లెలు(తంగచ్చి) అంటూ పోల్చగా.. మరికొందరు మాత్రం విజయ్ రాజకీయ భవిష్యత్తును.. ఆయన భార్య సంగీతను ప్రస్తావిస్తూ త్రిష ఇటువంటి పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా ఉంటేనే మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చల నడుమ మరికొందరు నెటిజన్లు నటుడు శింబు (మాజీ ప్రియుడిగా ప్రచారం ఉంది) పేరును తెరపైకి తెచ్చారు. విజయ్ పొలిటికల్ ఇమేజ్‌ను ఇబ్బంది పెట్టకుండా.. ప్రస్తుతం సింగిల్‌గా ఉన్న శింబును త్రిష పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ విమర్శనాత్మకంగా.. సరదాగా సలహాలు ఇవ్వడం కనిపించింది. వీటికి తోడు గిల్లి, లియో చిత్రాల్లో వీరిద్దరి కాంబినేషన్‌ను ప్రస్తావిస్తూ వారి ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ కెమిస్ట్రీపై నెటిజన్లు రకరకాల విశ్లేషణలు చేశారు.ఏది ఏమైనా తన అందంతో నెటిజన్లను కట్టిపడేస్తూనే... సోషల్ మీడియా వేదికగా నిరంతరం చర్చల్లో నిలవడం త్రిష ప్రత్యేకత. ఒకవైపు సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న ఈ తమిళ తంగం.. మరోవైపు సోషల్ మీడియాలో తన ప్రొఫైల్ ద్వారా కోట్లాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. వివాదాలు, విమర్శలు ఎలా ఉన్నా త్రిష పసుపు చీర లుక్ మాత్రం ఇన్‌స్టాగ్రామ్‌లో సెన్సేషన్‌గా మారింది.

రన్‌టైమ్: నిడివి పెరిగినా ప్రేక్షకుల ఆదరణ!

వెండితెరపై సినిమా చూసే అనుభవంలో కాలక్రమేణా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు సినిమాలకు రెండున్నర గంటల నిడివి మాత్రమే ఐడియల్ రన్‌టైమ్‌గా ఉండేది. అంతకంటే ఎక్కువైతే ప్రేక్షకులు బోర్ ఫీలవుతారనే అపనమ్మకం ట్రేడ్ వర్గాల్లో ఉండేది. కానీ ప్రస్తుతం ఆ లెక్కలన్నీ తలకిందులవుతున్నాయి. కథలో దమ్ముంటే, భావోద్వేగాలు పండుతుంటే నిడివి ఎంత ఉన్నా? ప్రేక్షకులు ఆస్వాదిస్తారనే నిజాన్ని ఇటీవలి కాలంలోని బాక్సాఫీస్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత ట్రెండ్‌ను పరిశీలిస్తే -పుష్ప 2-, -యానిమల్-, -ఆర్ఆర్ఆర్- వంటి భారీ చిత్రాలు మూడు గంటల నిడివిని దాటినా బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేశాయి. రీసెంట్‌గా రిలీజ్ అయిన రణ్‌వీర్ సింగ్ -ధురంధర్- చిత్రం కూడా సుదీర్ఘమైన రన్‌టైమ్‌తో థియేటర్లలోకి వచ్చి అద్భుతమైన వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ విజయాపజయాల సరళి చూస్తే? ప్రేక్షకులకు నిడివితో పనిలేదని, బలమైన కంటెంట్ ఉంటే గంటల తరబడి థియేటర్లలో కూర్చునేందుకు సిద్ధంగా ఉన్నారని రుజువవుతోంది.ఈ కోవలోనే కన్నడ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ మూవీ -టాక్సిక్- కూడా భారీ నిడివితో రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంతటి సుదీర్ఘ రన్‌టైమ్ ఉండటం ఆసక్తికరంగా మారినా? మేకర్స్ మాత్రం కంటెంట్‌పై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.సినిమాలో ల్యాగ్ ఉందా లేదా అనేది నిడివిని బట్టి నిర్ణయించలేమని, కథ చెప్పే విధానం .. స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటే మూడు గంటల సమయం కూడా నిమిషాల్లో గడిచిపోతుందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దర్శకులు తాము చెప్పాలనుకున్న భావోద్వేగాలను, పాత్రల లోతును ప్రేక్షకులకు పూర్తిగా అనుభూతి చెందించడానికి పెద్ద చిత్రాలకు అదనపు సమయం ఎంతో అవసరమవుతోంది. అందుకే కంటెంట్ డిమాండ్ చేసినప్పుడు నిడివిని తగ్గించడానికి దర్శక నిర్మాతలు వెనుకాడటం లేదు.మొత్తానికి సినిమాలో విషయం ఉంటే? రన్‌టైమ్ మ్యాటర్ కాదు అనే సరికొత్త సూత్రం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ట్రెండ్‌గా మారింది. ప్రేక్షకులకు విజువల్ వండర్‌తో పాటు బలమైన డ్రామాను అందించగలిగితే? వారు సినిమా నిడివిని సమస్యగా చూడరని భారీ చిత్రాల విజయం నిరూపిస్తోంది. రాబోయే రోజుల్లో పెద్ద బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలన్నీ ఇదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది.ఈ పరిణామాలు దర్శకులకు మరింత స్వేచ్ఛను ఇస్తున్నాయి. కమర్షియల్ హంగుల కోసం కథను కుదించాల్సిన అవసరం లేకుండా ఊహాశక్తికి తగినట్లుగా పూర్తి స్థాయి సినిమాను తెరకెక్కించే వెసులుబాటును ఈ ట్రెండ్ కల్పిస్తోంది. ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా పరిపూర్ణ సినిమా అనుభూతిని కోరుకుంటున్నారనడానికి సుదీర్ఘ చిత్రాల భారీ విజయమే తిరుగులేని నిదర్శనంగా భావిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965